ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పల్నాడు జిల్లా వార్తలు

5

శుక్రవారం 22 ఆగస్టు 2025



నకరికల్లు మండలంలో వరి నాట్లు

స్మార్ట్ మీటర్లతో బహుళ ప్రయోజనాలు
- విద్యుత్‌శాఖ జీఎం విజయ్‌కృష్ణ

గంజాయి కేసులో 14 మంది అరెస్టు
- ఇద్దరు కీలక నిందితుల పరారీ

విధుల్లో చేరకపోతే ఇంటికే!
- గ్రామ సచివాలయ సిబ్బందికి ఝలక్

6

కనుమరుగైన కర్మాగారం
- భూములు ఇచ్చిన రైతుల్లో నిరాశ
- ప్రభుత్వాల తీరును ఎండగడుతున్న రైతులు
- జీతం బకాయి, డిపాజిట్లపై ప్రశ్నలు
- భవిష్యత్ కార్యాచరణపై సందిగ్ధం



8

చెత్త శుద్ధి

- పారిశుధ్యంపై 75 శాతం సంతృప్తి
- రాష్ట్రంలో గుంటూరు జిల్లా ప్రథమ స్థానం
- వెనుకబడిన పల్నాడు, బాపట్ల జిల్లాలు
- చెత్త సేకరణపై ప్రభుత్వం ఐవీఆర్ఎస్ సర్వే



గ్రామాల్లో చెత్తసేకరణను పర్యవేక్షిస్తున్న జడ్పీ సీఈఓ వీర్ల జ్యోతిబసు

నరసరావుపేట, ఆగస్టు 21 (ఆంధ్ర జ్యోతి): చెత్త సేకరణ.. పారిశుధ్యంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతానికి భిన్నంగా ఇంటింటా చెత్త సేకరణ జరుగుతోందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఐవీఆర్ఎస్ సర్వేలో ప్రజలు తమ అభిప్రాయాలను తెలిపారు. పారిశుధ్యం, చెత్తసేకరణపై ప్రభుత్వం ఈ ఏడాది మార్చి నుంచి ఆగస్టు 11 వరకు సర్వే చేసి ప్రజల నుంచి వచ్చిన సంతృప్తి స్థాయిల ఆధారంగా జిల్లాలకు ర్యాంకులు ప్రకటించింది. ఐవీఆర్ఎస్ సర్వే నివేదిక ఆధారంగానే రాష్ట్రస్థాయి అధికారులు సమీక్షలు నిర్వహిస్తున్నారు. చెత్త సేకరణపై సర్వేలో గుంటూరు జిల్లాలో వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు 75 శాతం సంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో గుంటూరు జిల్లా రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సర్వేలో పల్నాడు, బాపట్ల జిల్లాలు వెనుకబడ్డాయి. ఈ రెండు జిల్లాలో చెత్త సేకరణపై 66 శాతం మంది మాత్రమే సంతృప్తి వ్యక్తం చేశారు.

తెల్లవారక ముందే పల్లె బాట..

జిల్లా అధికారుల కృషితోనే చెత్త సేకరణలో గుంటూరు జిల్లా (మిగతా 6లో)

సేకరణపై సంతృప్తి

- గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కెళ్ళపాడు-2 లో ఉన్న 38 మందికి చెత్త సేకరణపై ఐవీఆర్ఎస్ కాల్స్ వచ్చాయి. చెత్తసేకరణపై వీరిలో 95 శాతం మంది సంతృప్తిగా ఉన్నట్లు సమాధానాలు ఇచ్చారు. వారానికి రెండు సార్లు చెత్త సేకరణ ప్రశ్నకు 89 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు.
- కాకుమాను మండలం బోడెపాలెంలో 36 మందికి కాల్స్ రాగా అందరూ సానుకూలంగా స్పందించారు.
- పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం గోపాలంవారిపాలెంలో 40 మందికి సర్వే కాల్స్ రాగా 95 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు.
- యడ్లపాడు మండలం సొలసలో 36 మందికి కాల్స్ రాగా 85 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు.
- బాపట్ల జిల్లాలో చీరాల మండలం సాల్మన్ సెంటర్ లోని 27 మందికి కాల్స్ రాగా 88 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు.

సాగు ముమ్మరం

- 1.52 లక్షల ఎకరాల్లో పంటలు
- చివరి దశలో పత్తి.. విస్తృతంగా వరి నాట్లు
- ఈ నెలాఖరుకు గణనీయంగా పెరగనున్న సాగు

పత్తి చేను




(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

అడపాదడపా వర్షాలు.. నిండుకుండల్లా జలాశయాలు.. కాల్వల్లో పుష్కలంగా నీటితో జిల్లాలో కొన్ని రోజులుగా పంటల సాగు ఊపందుకుంది. ఇటీవల వరకు ముఖం చాటేసిన వరుణుడు.. సాగునీటిపై సంశయంతో ఖరీఫ్ సాగుపై సందేహాలు నెలకొన్నాయి. అయితే అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు, నాగార్జున సాగర్ జలాశయానికి భారీగా వరదతో కాల్వలకు సాగునీటిని విడుదల చేస్తున్నారు. దీంతో రైతులు వ్యవసాయ పనులు ముమ్మరంగా చేపట్టారు. జిల్లాలో సాధారణ విస్తీర్ణం 3,89,018 ఎకరాలు కాగా ఇప్పటివరకు 1,52,480 ఎకరాల్లో పత్తి, కంది, వరి తదితర పంటల సాగైనట్లు వ్యవసాయశాఖ వెల్లడించింది. గత వారం రోజుల్లోనే 27,790 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. పత్తి సాధారణ విస్తీర్ణం 2,28,890 ఎకరాలు కాగా 1,26,583 ఎకరాల్లో సాగు చేశారు. పత్తి సాగు చివరి దశకు చేరుకుంది. వేసవిలో సాగు చేసిన పత్తి కాపు దశలో ఉంది. కంది సాధారణ విస్తీర్ణం 52,635 ఎకరాలు కాగా 7,787 ఎకరాల్లో సాగైంది. వర్షాలతో కంది విత్తుతున్నారు. వరి సాధారణ విస్తీర్ణం 96,497 ఎకరాలకు ఇప్పటికి 16,007 ఎకరాల్లో సాగైంది. విస్తృతంగా వరి నాట్లు వేస్తున్నారు. మొక్కజొన్న తదితర పంటల సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. పొగాకు సాగును పూర్తిగా నిషేధించారు. ఈ నెలాఖరుకు వరి సాగు గణనీయంగా పెరగనున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. నర్సరీల్లో మిరప నారు పెంపకం జరుగుతోంది. మిరప మొక్కలు నాటేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ముమ్మరంగా సాగు పనులతో వ్యవసాయ కార్మికులకు చేతినిండా పనులు దొరుకుతున్నాయి. గోదావరి జిల్లాల నుంచి దమ్ము చేసేందుకు ట్రాక్టర్లు, నాట్లు వేసేందుకు జిల్లాకు కూలీలు పెద్దసంఖ్యలో వస్తున్నారు. వ్యవసాయ పనిముట్ల అమ్మకాలు కూడా జోరుగా సాగుతున్నాయి.

వారు దివ్యాంగులు కాదు

పింఛన్ లబ్ధిదారుల్లో అనర్హులపై వేటు

- క్షేత్రస్థాయి సర్వేలో వైకల్యం లేదని గుర్తింపు
- పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 10,275 మందికి రద్దు
- గ్రామ, వార్డు సచివాలయాల్లో జాబితాలు.. సెప్టెంబరు నుంచి నిలుపుదల



పల్నాడు జిల్లాలో 35,338 మంది దివ్యాంగ పింఛన్‌దారుల్లో 3,086 మందిని అనర్హులుగా గుర్తించినట్లు డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి తెలిపారు. రూ.15,000 పింఛన్ పొందు తున్న 1035 మందిలో 76 మంది అనర్హులన్నారు. 581 మందికి రూ.6000 పింఛన్‌కు అర్హులుగా గుర్తించామన్నారు. మరో 20 మందికి వృద్ధాప్య ఫించన్ అర్హులుగా ఎంపిక చేశామన్నారు. అనర్హులుగా గుర్తించిన 3162 మందికి అర్హతను నిర్ధారించుకునేందుకు అవకాశం ఇచ్చామన్నారు.

నరసరావుపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వైకల్యం లేకపోయినా.. నకిలీ ధ్రువీకరణలతో.. ముడుపులు సమర్పించి.. గత ప్రభుత్వంలో వైసీపీ నేతల సిఫార్సులతో అధికారులపై ఒత్తిడి చేయించి.. పలువురు దివ్యాంగ పింఛన్లు అందుకున్న వారిపై వేటు పడింది. క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలన చేసిన అధికారులు అనర్హులను గుర్తించారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 10,275 మంది అనర్హులు దివ్యాంగ పింఛన్లు అందుకున్నట్లు గుర్తించిన ప్రభుత్వం వాటిని రద్దు చేసింది. అర్హులు దరఖాస్తులతో కార్యాలయాలు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండగా అనర్హులు ప్రభుత్వం అందజేసే పింఛన్‌తో లబ్ధి పొందుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. దివ్యాంగ పింఛన్లలో అనర్హులపై ఎక్కడికక్కడ పెద్దసంఖ్యలో ఫిర్యాదులు రాగా గత ప్రభుత్వంలో వాటిని బుట్టదాఖలు చేశారు. కూటమి ప్రభుత్వం ఆయా ఫిర్యాదులపై ప్రత్యేకంగా దృష్టి సారించి (మిగతా 6లో)

ఎల్‌ఆర్‌ఎస్

నిబంధనలకు తిలోదకాలిచ్చి.. ముడుపులతో ఇబ్బడి ముబ్బడిగా వెలిసిన అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి అల్లాడుతున్న సామాన్యులకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం ఇచ్చింది. లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్) ద్వారా ఆయా ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతో ఇక తమ కష్టాలు తీరాయని కొనుగోలుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఆయా ప్లాట్లలో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు లేక అల్లాడుతూ ఉన్న వారు ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా క్రమబద్ధీకరించేందుకు సిద్ధమవుతున్నారు.



మున్సిపాలిటీ పరిధిలో గుర్తించిన అక్రమ లే అవుట్

- అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ
- అక్టోబరు 24 వరకు గడువు పొడిగింపు
- 2025 జూన్ 30కు ముందు కొనుగోలు చేసిన ప్లాట్లకు వర్తింపు
- పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 700 లేఅవుట్లకు అవకాశం

(మాచర్ల, ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ హయాంలో అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి తాము మోసపోయామని పలువురు ఫిర్యాదులు చేశారు. అయితే అప్పట్లో ఆ ఫిర్యాదులను అధికారులు బుట్టదాఖలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వేసిన లే అవుట్లను కొనుక్కొని లబోదిబోమంటున్న వారి సంఖ్య గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో వేలల్లోనే ఉంది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అక్రమ లే అవుట్ల అంశంపై దృష్టి సారించింది. గతేడాది చివరిలోనే మున్సిపాలిటీలు, అర్బన్ డెవలప్‌మెంట్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా వేసిన లేఅవుట్ల జాబితాను సేకరించింది. అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించే విషయంలో తీసుకునే నిర్ణయంపై జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన మూడుదఫాలుగా సమావేశాలు జరిగాయి. నిబంధనలకు విరుద్ధంగా వేసిన లే అవుట్లలో అధికశాతం వ్యక్తిగత ప్లాట్లుగా మారినందు వల్ల తీసుకునే నిర్ణయం వినియోగదారులకు మేలు చేసేదిగా ఉండాలని నిర్ణయించింది. ఈ మేరకు విస్తీర్ణాన్ని బట్టి రాయితీ వర్తించేలా గత నెల 26న ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. తొలుత సెప్టెంబరు చివరి వరకే గడువు ఇవ్వగా (మిగతా 6లో)

ఆదరణ.. అపహరణ

- బీసీ కార్పొరేషన్ పరికరాలు మాయం
- వైసీపీ నేతలు విక్రయించేశారని అనుమానాలు

పిడుగురాళ్ల, పొన్నూరుటౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా ఆదరణ-2 పథకం ద్వారా స్వయం ఉపాధి నిమిత్తం ప్రత్యేకంగా పరికరాలను పంపిణీ చేసింది. 90 శాతం సబ్సిడీతో కుల వృత్తిదారులకు ప్రభుత్వం వారికి అవసరమైన పరికరాలను మంజూరు చేసింది. ఈ పథకంలో 2014 నుంచి 19 వరకు వేలాది మంది లబ్ధి పొందారు. అయితే 2019 ఎన్నికల ముందు ఆదరణ 2 పథకం కింద చేతి, కులవృత్తిదారులకు పంపిణీ చేసేందుకు పెద్దఎత్తున పనిముట్లను మండలాల వారీగా కేటాయించింది. ఇంతలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో యంత్ర పరికరాల పంపిణీని అధికారులు నిలిపివేశారు. 2019 తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగా ఆదరణ పరికరాలను ఎవరూ పట్టించుకోలేదు. గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు ఎక్కడికక్కడ వాటిని మాయం చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల సహకారంతోనే వైసీపీ నాయకులు అమ్ముకుని సొమ్ము చేసుకున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఆయా పరికరాలు ప్రస్తుతం కనిపించడంలేదు. పరికరాలతో పాటు ఎంపీడీవో కార్యాలయాల్లో ఉండాల్సిన లబ్ధిదారుల జాబితాలు కూడా మాయం చేసేశారు. అయినా అధికారులు మౌనం దాల్చడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గిడ్డంగుల్లో వాషింగ్ మిషన్లు, ఇస్త్రీపెట్టెలు, కుట్టుమిషన్లు, గ్రైండర్లు, గ్రాస్ కట్టర్లు, పాడి రైతులకు సరఫరా చేసే సైకిళ్ళు, చేపల అమ్మకం దారులకు సరఫరా చేసే యూనిట్లు, కంప్యూటర్లు, వాయిద్య పరికరాలు, సెలూన్ ఛైర్లు, చాప్‌కట్టర్లు వంటి విలువైన యంత్ర పరికరాలు ప్రస్తుతం కనిపించడంలేదు.

పిడుగురాళ్లలో చోరీ.. అధికారుల మౌనం

పిడుగురాళ్ల మార్కెట్ యార్డు గోడౌన్‌లో ఆదరణ పరికరాలను భద్రపరిచారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన కొన్నాళ్లకు మార్కెట్ యార్డు గోడౌన్‌కు కన్నం వేసి పనిముట్లు మాయం చేశారు. షట్టర్‌ను తొలగించి కొన్ని ఆదరణ పనిముట్లను దొంగలించారని అప్పట్లో ప్రచారం జరిగింది. అయితే దీనిపై అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. పరికరాలను బీసీ కార్పొరేషన్‌కు రికవరీ చేశామని చెప్తున్న అధికారులపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పొన్నూరులో పోలీసులకు టీడీపీ నేతల ఫిర్యాదు

పొన్నూరు మండలానికి సంబంధించి రూ.కోటి విలువైన వంద పరికరాలను నిడుబ్రోలులోని మార్కెట్ యార్డు గోడౌన్‌లో భద్రపరిచగా ప్రస్తుతం అవి కనిపించడం లేదు. ఓ ప్రజాప్రతినిధి రెండు గ్రామాల్లో పరికరాలను విక్రయించి సొమ్ము చేసుకున్నారని సమాచారం. ఓ గ్రామానికి చెందిన మాజీ యానిమేటర్ పరికరాల మాయంలో కీలకపాత్ర పోషించినట్లు ఆరోపణలు ఉన్నాయి. కాగా పరికరాల మాయంపై లబ్ధిదారులతో కలిసి టీడీపీ నాయకులు రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు



గుంతలతో నిండిన తాళ్ళూరు నుంచి తమ్మవరం వెళ్ళే రోడ్డు

రోడ్డు.. గోతుల మయం

- తమ్మవరంవాసుల అవస్థలు



రాళ్ళు బయట పడటంతో ప్రయాణానికి ఇబ్బందికరంగా మారిన రోడ్డు

పెదకూరపాడు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 75 తాళ్ళూరు నుంచి తమ్మవరం వెళ్లే రోడ్డు గోతులమయంగా మారింది. అధ్వానంగా మారిన రోడ్డుపై రాకపోకలకు ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని శివారు గ్రామమైన తమ్మవరం అంటే ప్రజాప్రతినిధులకు, అధికారులకు చిన్నచూపు అని అందువల్లే రోడ్డు గురించి పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామం నుంచి మండల కేంద్రమైన పెదకూరపాడుకు వెళ్లాలంటే నరకం కనిపిస్తోందంటున్నారు. తమ్మవరం నుంచి అమరావతి వైపు వెళ్లాలన్నా ఆ రోడ్డు ఆధారం. గ్రామం నుంచి 75 తాళ్ళూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు సుమారు 40 మందికిపైగా విద్యార్థులు ఆటోల్లో, మరికొందరు సైకిళ్లపై ఇబ్బందికరంగా రాకపోకలు సాగిస్తుంటారు. ఆటోల్లో వెళ్లేవారు అయితే ఎప్పుడు ఏమి జరుగుతుందోననే ఆందోళనతో భయంభయంగా ప్రయాణిస్తుంటారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమ గ్రామానికి రోడ్డు వేస్తారని ఆశించిన గ్రామస్థులకు 14 నెలలుగా నిరాశకు లోనయ్యారు.

కృష్ణమ్మ దోబూచులాట

- తగ్గినట్టే తగ్గి పెరిగిన వరద ఉధృతి
- అమావాస్య పోటుతో నదిలో పెరుగుతున్న నీటి మట్టం
- లోతట్టు ప్రాంతాల నుంచి మెరక భూముల్లోకి వరద
- ముంపు బారిన వాణిజ్య పంటలు

8



కొల్లూరు: చింతల్లంక వద్ద పొలాల్లో నుంచి వరద నీటిలో వస్తున్న మహిళా రైతులు



పిడుగురాళ్లలో అభివృద్ధి పనుల కోసం తోలిన కంకర

ఇసుక కొరతతో ఇక్కట్లు

అభివృద్ధి పనులకు అందుబాటులో లేని వైనం

పిడుగురాళ్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులకు ఇసుక పెద్ద సమస్యగా మారింది. పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల పట్టణాలలో గత నెలలో సిమెంట్ రోడ్లు, సైడ్ డ్రెయిన్ల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. ఆయా పట్టణాల్లో రోడ్లు, సైడ్ డ్రెయిన్ల నిర్మాణానికి కాంట్రాక్టర్లు కంకర సిద్ధం చేసుకున్నారు. అయితే ఇసుక అందుబాటులో లేకపోవడంతో ఆయా పనులు నిలిచిపోయాయి. వర్షాల కారణంగా ఇసుక కొరత ఏర్పడిందని అధికారులు చెప్తున్నారు. దీంతో గత నెల రోజులుగా పనులు నిలిచిపోయి.. రోడ్లపై కంకర గుట్టలు దర్శనమిస్తున్నాయి. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. అయితే ఆ పనులు పూర్తి చేసేందుకు అవసరమైన ఇసుక అమరావతి, క్రోసూరు, కస్తల రేవుల నుంచి రావడంలేదు.

వారు దివ్యాంగులు కాదు

(5వ పేజీ తరువాయి)

క్షేత్రస్థాయిలో పరిశీలన చేయించింది. ఒక ఆర్థోపెడిక్, ఒక జనరల్ ఫిజిషియన్, సంబంధిత ఏరియా వైద్య అధికారి సభ్యులుగా, వీరికి సహాయకుడిగా ఒక డిజిటల్ అసిస్టెంటుతో కూడిన ప్రత్యేక బృందాలు దివ్యాంగ పింఛన్ పొందుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అనర్హులను గుర్తించాయి. కిందటేడాది డిసెంబరులో మొదలైన పరిశీలన ప్రక్రియ ఎనిమిది నెలలపాటు కొనసాగి, ఎట్టకేలకు అనర్హుల జాబితాను ప్రకటించింది. ఆ జాబితాలో వేలమంది అనర్హులు ఉండడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. 40 శాతం కంటే వైకల్యం తక్కువ ఉన్నవారికి దివ్యాంగుల పింఛన్‌కు అనర్హులుగా అధికారులు నిర్ధారించారు. తీవ్ర అనారోగ్యంపాలై మంచానికే పరిమితమైనవారికి ఇచ్చే రూ.15000 పింఛను పొందేవారిలో 75 శాతం మంది అనర్హులే ఉన్నట్లు తేలింది. రూ.6000 పింఛన్ అందుకుంటున్న వారిలో 30 శాతం అనర్హులను సర్వేలో అధికారులు గుర్తించారు. పల్నాడు జిల్లాలో 3,086 మంది, గుంటూరు జిల్లాలో 2,489 మంది, బాపట్ల జిల్లాలో 3,853 మంది అనర్హులుగా గుర్తించి వారికి సెప్టెంబరు నుంచి పింఛన్‌ను రద్దు చేసినట్లు అధికారులు ప్రకటించారు. ఎలాంటి అర్హత లేనివారికి పింఛన్లు పూర్తిగా నిలిపివేయగా, సాధారణ వైకల్యం కింద దివ్యాంగులుగా ఉన్న వారికి సెప్టెంబరు నుంచి రూ.6 వేల పింఛను అందించనున్నారు. మరికొందర్ని వృద్ధాప్య పింఛన్ల జాబితాలో చేర్చి వారికి రూ.4 వేలు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఇక ఆయా జాబితాలను గ్రామ, వార్డు సచివాలయాలకు అధికారులు పంపారు.

అరాచకాలు బయటపడిందిలా..

వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా పింఛన్ల మంజూరు చేశారు. అర్హులను తొలగించి, తమ అనుయాయులకు పింఛన్లు అందజేశారు. ప్రధానంగా దివ్యాంగ పింఛన్ల విషయంలో ఈ అక్రమాలు అంతులేకుండా జరిగాయి. అదే అంశాన్ని తాజా జాబితా స్పష్టం చేస్తోంది. ఇష్టమొచ్చినట్లుగా సదరం సర్టిఫికెట్లు జారీ చేయడం, వైకల్య స్థాయిని పెంచి పింఛన్లు కాజేయడం వంటి విధానాలతో అర్హులకు అందాల్సిన పింఛన్లను వైసీపీ అనుయాయులు కొల్లగొట్టారు. పింఛన్లు పంపిణీ చేసే క్రమంలో కూటమి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులకు ఈ అనర్హులు ఎదురుపడడంతో వారు విస్తుపోయారు. దీనిపై విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరారు. తొలి నెలలోనే ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లినా, ఇదిగోఅదిగో అంటూ డిసెంబరులో పరిశీలన ప్రక్రియ ప్రారంభించారు. దీంతో పింఛన్లలోని అక్రమాలన్నీ క్షేత్రస్థాయిలో సర్వేతో వెలుగులోకి వచ్చాయి.

ఎల్‌ఆర్‌ఎస్

(5వ పేజీ తరువాయి)

దానిని అక్టోబరు 24 వరకు పొడిగించింది. నిబంధనలకు విరుద్ధం గా వేసిన లేఅవుట్‌లో ఇంటి నిర్మాణం చేపట్టా లంటే ప్లాన్ తీసుకునే సమయంలో అక్కడి విలువలో 14 శాతం ఫీజు అదనంగా చెల్లించాలి. అభివృద్ధి, ఇతరత్రా రుసుంలు అదనం. ప్రభుత్వం ఇచ్చిన వెసులుబాటుతో రూ.లక్ష ఖర్చు అయ్యే వినియోగదారుడికి ఇప్పుడు రూ.50,000లకే అనుమతి లభించనున్నది. మున్సిపాలిటీలతో పాటు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పరిధిలోని లే అవుట్లన్నింటికి ఈ ఎల్‌ఆర్‌ఎస్ వర్తించేలా ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. 2025 జూన్ 30కు ముందు కొనుగోలు చేసిన ప్లాట్లన్నింటికీ ఈ ఎల్‌ఆర్‌ఎస్ స్కీం వర్తించనుంది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లా వ్యాప్తంగా చూస్తే దాదాపు 700 అనధికార లే అవుట్లకు ప్రభుత్వం క్రమబద్ధీకరణ వెసులుబాటు కల్పించింది. బావుడా కింద 93 అనధికార లేఅవుట్లను గుర్తించిన యంత్రాం గం వాటికి వెసులుబాటు కల్పించింది. ఇదే సమ యంలో భవిష్యత్తులో నిబంధనలకు విరుద్ధంగా ఏ ఒక్క లేఅవుట్ కూడా వేయకూడదని, అలా జరిగితే సంబంధిత విభాగాల అధికారులను బా ధ్యులను చేసేందుకు వెనకాడబోమని ప్రభుత్వం హెచ్చరించింది.

తొలగించిన పింఛన్లు పునరుద్ధరించాలని..

- సెల్ టవర్ ఎక్కిన వైసీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు
- మద్దతు తెలిపిన మాజీ మంత్రి మేరుగ



టవర్ ఎక్కిన రామయ్యను కిందకు దించుతున్న స్థానికులు

బాపట్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : రద్దు చేసిన దివ్యాంగ పింఛన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు, వైసీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. బాపట్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపారు. ఉదయం 5.30 గంటలకు టవర్ ఎక్కిన రామయ్య 11గంటల వరకు అక్కడే ఉన్నాడు. పట్టణ సీఐ ఆర్.రాంబాబు, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, తహసీల్దార్ షేక్.సలీమా చర్చలు జరిపినప్పటికి వినిపించుకోలేదు. ఆయనకు మద్దతుగా దివ్యాంగులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. కలెక్టర్ వచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. వీరికి మద్దతుగా సీఐటీయూ నాయకుడు కె.శరత్ వచ్చి అధికారుల వైఖరిని తప్పుబట్టారు. పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఆయనకు మద్దతుగా వైసీపీ శ్రేణులు తరలి వచ్చారు. మాజీ మంత్రి మేరుగ నాగార్జున అక్కడికొచ్చి..వారికి మద్దతు తెలియజేశారు. కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి రామయ్యను శాంతింప చేసి కిందకు దించే ప్రయత్నం చేశారు. ఇంతలో డీఎస్పీ జి.రామాంజనేయులు రామయ్యను ఆసుపత్రికి తీసుకెళతామని అంబులెన్స్ తెప్పించారు. అయితే కలెక్టర్ కార్యాలయానికి తీసుకెళ్లి వినతి పత్రం ఇస్తామని మేరుగ చెప్పడంతో అక్కడ కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో పి.గ్లోరియా ఘటనా స్థలానికి చేరుకొని వినతి పత్రం తీసుకొని వారి సమస్యను తెలుసుకున్నారు. అనంతరం రామయ్యను అంబులెన్స్‌లో ఏరియా వైద్యశాలకు తరలించారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు..

అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ ఇవ్వటం జరుగుతుందని డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 14వేల మంది దివ్యాంగ పింఛనుదారులకు నోటీసులిచ్చి సర్టిఫికెట్‌లు తెచ్చుకోమని చెప్పామన్నారు. అందులో 683 మంది మెడికల్ సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు వెళ్లకపోవడంతో.. మళ్లీ నోటీసులివ్వడం జరిగిందన్నారు. ఈ నెల 25వ తేదీలోపు మెడికల్ బోర్డుకు వెళ్లి సర్టిఫికెట్ తెచ్చుకోవాలని చెప్పామన్నారు. సర్టిఫికెట్ తెచ్చుకుంటే జూలై నెలతో కలిపి రెండు నెలల పెన్షన్ ఇవ్వడం జరుగుతుందన్నారు.

రామయ్యతో పాటు వైసీపీ శ్రేణులపై చర్యలు

చల్లా రామయ్యతో పాటు వైసీపీ నాయకులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ జి.రామాంజనేయులు తెలిపారు. పట్టణ సీఐ ఆర్.రాంబాబుతో కలిసి పట్టణ పోలీసు స్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. చల్లా రామయ్యతోపాటు వైసీపీ నాయకులు కర్లపాలెం కిషోర్, కోకి రాఘవరెడ్డి, కోకి అంజిరెడ్డి, నర్రావుల వెంకట్రావు, శృంగారపురం శ్రీను, జోగి రాజా మరికొందరిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. రామయ్యపై గతంలో మూడు కేసులు రిపోర్ట్ అయి ఉన్నాయన్నారు. అధికారులను బెదరించడం, ప్రాణ నష్టం జరుగుతుందని తెలిసి కూడా సెల్‌టవర్ ఎక్కటం నేరమన్నారు. అతనికి ఏదైన జరిగితే కుటుంబం కూడా నష్టపోతుందన్నారు. కాబట్టి భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు.

గంజాయి కేసులో 14 మంది అరెస్టు

- ఇద్దరు కీలక నిందితుల పరారీ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్దన్ రావు

పొన్నూరుటౌన్, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న అలాగే సేవిస్తున్న 14 మంది నిందితులను అరెస్టు చేసినట్లు తెనాలి డీఎస్పీ బి.జనార్దన్‌రావు తెలిపారు. పొన్నూరు అర్బన్ స్టేషన్లో గురువారం నిందితుల అరెస్టు చూపారు. నిందితుల నుంచి కేజిన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సీఐ ఎల్.వీర నాయక్‌కు పోలీస్ స్టేషన్‌కు కిలోమీటర్ దూరంలోని ఓం కాలనీ సమీపంలోని పంట పొలాల్లో గంజాయి అమ్ముతున్నారని, తాగుతున్నారని విశ్వసనీయ సమాచారం అందినట్లు తెలిపారు. సీఐ, ఎస్సై వి.శ్రీహరి, సిబ్బంది అక్కడ సోదాలు నిర్వహించడంతో.. 14 మంది యువకులు పరార్వడానికి ప్రయత్నించగా అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. షేక్ ఫజల్, షేక్ ఫయాజ్, నక్కల రవికుమార్, షేక్ మహబూబ్ ఖాన్, షారూక్ ఖాన్, నున్న యశ్వంత్ అనే యువకులు గంజాయి విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వీరితోపాటు గంజాయి సేవిస్తున్న పఠాన్ ఇమ్రాన్ ఖాన్, షేక్ బషీర్, కంచర్ల చంద్రకాంత్, రుద్రపాటి అభిషేక్, షేక్ అల్లాబక్షు, ఖమ్మంపాటి శ్రీనాథ్ రెడ్డి, ఏకశిరి సూర్యనారాయణ, బానోతు ప్రశాంతులను అరెస్ట్ చేశామన్నారు. ఒడిశాకు చెందిన మనోజ్ అనే గంజాయి సప్లయర్‌తో పాటు, గంజాయి విక్రయించే ఆశా అనే మహిళ పరారీలో ఉన్నట్లు డీఎస్పీ వెల్లడించారు. ఒడిశా నుంచి మనోజ్ అనే వ్యక్తి వచ్చి గంజాయి ఇచ్చి వెళ్తున్నట్లుగా నిందితులు అంగీకరించినట్లు చెప్పారు. మనోజ్ నుంచి తీసుకున్న గంజాయిని ఫజల్ అనే యువకుడు ఐదు గ్రాముల ప్యాకెట్లుగా చేసి, రూ.500కు లెక్కన విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. షేక్ ఫజల్ తల్లి ఆష కూడా గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిపారు. నిందితులను స్థానిక క్రిమినల్ కోర్టులో హాజరు పరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు. సీఐ, ఎస్ఐ, సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

పవన్ కల్యాణ్‌పై నిందలు మోపే కుట్ర

- జిల్లా జనసేన అధ్యక్షుడు గాదె విమర్శలు



సమావేశంలో మాట్లాడుతున్న గాదె వెంకటేశ్వరరావు

గుంటూరు మెడికల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిని, సంక్షేమాన్ని సమపాళ్లలో తీసుకొని వెళ్తూ.. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వంపై, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై నిందలు మోపే ప్రయత్నం చేస్తున్నారని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మండిపడ్డారు. లాడ్జి కూడలిలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియా సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఇటీవల విశ్రాంత ఐఏఎస్ విజయ్ కుమార్ పవన్ కల్యాణ్‌పై అధికార దుర్వినియోగం చేస్తున్నారని.. కోర్టులో తప్పుడు పిటిషన్ వేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో వైసీపీ కార్యకర్త కంటే హీనంగా వ్యవహరించిన విజయ్ కుమార్‌కు అవినీతి గురించి మాట్లాడే కనీస హక్కు లేదన్నారు. జగన్మోహన్‌రెడ్డి అవినీతికి అండగా నిలబడిన విజయ్ కుమార్.. చిత్తూరు జిల్లాలో అమర్ రాజా బ్యాటరీస్ రాష్ట్రం విడిచి వెళ్లిపోవడంలో ముఖ్య భూమిక పోషించారని విమర్శించారు. ప్రభుత్వంలో ముఖ్య భూమిక పోషించిన ధనుంజయ రెడ్డితో కలిసి విజయ్ కుమార్ పాల్పడిన అవినీతి అంతా ఇంతా కాదని ఆరోపించారు. గతంలో బహిరంగంగా జగన్మోహన్ రెడ్డిని దేవుడి బిడ్డగా పోల్చిన విజయ్‌కుమార్ వ్యవహారశైలిని రాష్ట్ర ప్రజలందరూ చూశారని ఆయన గుర్తు చేశారు. పవన్ కల్యాణ్‌పై నిందలు వేయటం.. ఆకాశంపై ఉమ్ము వేయడం లాంటిదని గాదె వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. జనసేన నాయకులు అడపా మాణిక్యాలరావు, శిఖా బాలు, చట్టాల త్రినాధ్, మధులాల్, పవన్, కిషోర్ పాల్గొన్నారు.

చెత్త శుద్ధి

(5వ పేజీ తరువాయి)

ప్రథమ స్థానంలో నిలిచిందని చెప్పవచ్చు. పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ ఆదేశాలతో జడ్పీ సీఈఓ జ్యోతి బసు, డీపీవో నాగసాయికుమార్ నిత్యం ఓ గ్రామానికి వెళ్లి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. కొద్ది నెలలుగా అధికారులు ఉదయమే పల్లె బాట పట్టారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులను కూడా ప్రతి రోజూ ఉదయం 7 గంటల కల్లా ఏదో ఒక గ్రామానికి పంపారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను పర్యవేక్షణ పరిశీలనకు జిల్లా పరిషత్‌లో ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేశారు. అన్ని గ్రామాల కార్యదర్శులు ఉదయమే విధుల్లో ఉండేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారు.ఈ చర్యలతో గ్రామాల్లో చెత్త తొలగింపు ప్రక్రియ చురుగ్గా సాగిందని అందువల్లే సర్వేలో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారని తెలిసింది.

సమష్టి కృషితోనే ప్రథమం

అందరి సమష్టి కృషితోనే చెత్త సేకరణలో రాష్ట్రంలోనే గుంటూరు ప్రథమ స్థానంలో నిలిచింది. సీఎం, డిప్యూటీ సీఎం ఆదేశాలకు అనుగుణంగా గ్రామాలను స్వచ్ఛ మార్గంలో నడిపేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేశారు. స్వచ్ఛ గ్రామం సాకారంతోనే ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధ్యమవుతుంది. 85 శాతం సంతృప్తి దిశగా జిల్లాను తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నాం.

-వీర్ల జ్యోతిబసు, సీఈఓ, గుంటూరు జడ్పీ

విద్యుదాఘాతంతో లారీ డ్రైవర్ మృతి

తాడికొండ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గ్రావెల్‌ను అన్ లోడ్ చేస్తున్న సమయంలో లారీకి హైటెన్షన్ విద్యుత్ తీగలు తగలడంతో డ్రైవర్ మృతి చెందిన ఘటన గురువారం సాయంత్రం తాడికొండ అడ్డరోడ్డులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండేపూడి గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ పల్లెపోగు నాగేశ్వరరావు(33) గ్రావెల్‌ను అన్‌లోడ్ చేస్తున్న క్రమంలో విద్యుత్ హైటెన్షన్ తీగలు కిందకు ఉండటంతో టిప్పర్‌కు తగిలాయి. దీంతో డ్రైవర్ విద్యుదాఘాతానికి గురయ్యాడు. అతనిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా డాక్టర్లు చనిపోయినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య మేరి ఫిర్యాదు చేయడంతో.. దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	111, 119, 130
చికెన్ విత్ స్కిన్(కిలో)	210.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	220.00

అవుట్ సోర్సింగ్‌కు..

సచివాలయ ఉద్యోగుల పర్యవేక్షణ అన్యాయం

- గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రజాక్

గుంటూరు సిటీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల పనితీరు పర్యవేక్షణకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించడం అన్యాయం అని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ అన్నారు. గురువారం జరిగిన క్యాబినెట్ సమావేశం లో గ్రామ/వార్డు సచివాలయాలను పర్యవేక్షించేందుకు మండల, జిల్లా స్థాయి కార్యాలయాల్లో పనిచేయడానికి 1,785 మంది సిబ్బందిని డిప్యూటేషన్, అవుట్ సోర్సింగ్ పద్ధతిన నియమించాలని నిర్ణయించారని తెలిపారు. గత ఆరు సంవత్సరాల నుంచి గ్రామ వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వాలనే కనీస ఆలోచన లేకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. సచివాలయ వ్యవస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కారించకపోగా కొత్త సమస్యలను ప్రభుత్వం సృష్టిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులైన గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులను పర్యవేక్షించడానికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ఎలా నియమిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నామన్నారు. అర్హులైన సచివాలయ ఉద్యోగులకే పదోన్నతులు కల్పించి మండల స్థాయి, జిల్లా స్థాయి సచివాలయ ప్రధాన కార్యాలయాల్లో ఖాళీలను భర్తీ చేసి, పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వానికి సూచించారు.

స్మార్ట్ మీటర్లతో బహుళ ప్రయోజనాలు

- విద్యుత్‌శాఖ జీఎం విజయ్‌కృష్ణ



సమావేశంలో జీఎం విజయ్‌కృష్ణ, అధికారులు

రెంట చింతల, ఆగస్టు 21 (ఆంధ్ర జ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో విద్యుత్ వినియోగదారులు బహుళ ప్రయోజ నాలను పొందవచ్చని అక్ర మంగా విద్యుత్‌ను వాడుకున్నా, మీటర్‌కు వేసిన సీల్ తీసేసినా 135 సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేయడంతో పాటు అపరాధ రుసుం విధిస్తామని ఏపీ సీపీడీసీఎల్ జీఎం(7 జిల్లాలు) విజయ్‌కృష్ణ తెలిపారు. గురువారం మండల కేంద్రమైన రెంటచింతలలోని శివాలయం కల్యాణ మండపంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటుతో సర్వర్‌కు ఎప్పటికప్పుడు సమాచారం వస్తుందని ఎక్కడైనా లోపాలుంటే వెంటనే స్పందించడానికి అవకాశం ఉంటుందన్నారు. లో వోల్టేజ్, కరెంట్ ఎన్నిసార్లు పోయింది, ఎక్కువ లేదా తక్కువ వాడుతున్నారా, ఎన్ని సార్లు అంతరాయం ఏర్పడిందనే విషయాలపై పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించడానికి అవకాశం ఉంటుందన్నారు. తల్లిదండ్రుల పేర్ల మీద ఉన్న విద్యుత్ కనెక్షన్‌ను గృహంలో ఉంటున్న వారి పేర్ల మీద మార్చుకోవాలని.. అప్పుడే పీఎం సూర్యఘర్ రాయితీ అందుతుందన్నారు. ఈఈ నూతలపాటి సింగయ్య, సీహెచ్ వెంకటేశ్వరరావు, డీఈఈ టి.వీరేశ్వరరావు, ఏఈ మస్తాన్ వలి, ఎల్ఐ శ్రీనివాసచారి పాల్గొన్నారు.

మొండికేసిన.. ● విధుల్లో చేరకపోతే ఇంటికే!

గ్రామ సచివాలయ సిబ్బందికి ఝలక్

గుంటూరు సిటీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం అంటే ఎక్కడ బదిలీ చేస్తే అక్కడకి వెళ్లాలి. కానీ, కొందరు గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులు అలా కుదరదు అంటున్నారు. అడిగిన చోట పోస్టింగ్ ఇస్తేనే వెళ్లి జాయిన్ అవుతామని మొండికేస్తున్నారు. అటువంటి వాళ్ల మీద కొరడా ఝులిపించేందుకు ఉమ్మడి గుంటూరు జిల్లా అధికారులు సిద్ధమయ్యారు. ఎవరైతే ఇంకా విధుల్లో చేరలేదో.. వాళ్ల సమాచారం సేకరిస్తున్నారు. వాస్తవానికి జూలై 5వ తేదీతోనే సచివాలయ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ సంపూర్తిగా ముగిసింది. కొన్ని శాఖలకు చెందిన ఉద్యోగులు మాత్రం ఇంతవరకు ఆయా స్థానాల్లో రిపోర్ట్ చేయలేదు. దూరంగా పోస్టింగ్ ఇచ్చారని కొందరు.. బదిలీల్లో తమకు అన్యాయం జరిగిందని మరికొందరు కేటాయించిన చోటికి వెళ్లలేదు. అటువంటి ఉద్యోగులు.. తమను కోరిన చోటికి బదిలీ చేయించాలని ప్రజా ప్రతినిధులతో ఉన్నత స్థాయి అధికారులకు ఫోన్లు చేయించి ఇబ్బంది పెడుతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న అధికారులు ఇంకా విధుల్లో జాయిన్ అవ్వని ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించినట్లు సమాచారం.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

విద్యుత్ శాఖ విజిలెన్స్ తనిఖీలు

● రూ.2.94 లక్షల అపరాధ రుసుం విధింపు

రెంటచింతల,ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు గురువారం రెంటచింతలతో పాటు పలు గ్రామాల్లోని గృహ వినియోగదారులపై మెరుపుదాడి నిర్వహించి అక్రమంగా విద్యుత్‌ను వాడుకుంటున్న వారిపై రూ.2.94 లక్షల అపరాధరుసుం విధించినట్లు విద్యుత్ ఈఈలు సీహెచ్.వెంకటేశ్వరరావు, నూతలపాటి సింగయ్యలు చెప్పారు. మీటర్ లేకుండా, ఉన్నా విద్యుత్ చౌర్యానికి పాల్పడటం, ఇతర కేటగిరిలో వాడకం, అదనపులోడు వాడకం మొత్తం రూ.2.94లక్షలు అపరాధరుసుం విధించామన్నారు. తనిఖీలు మంచికల్లు, పాలువాయి, మల్లవరం, తుమ్మకోట, పశర్లపాడు, గోలి, సత్రశాలలో నిర్వహించగా 55 బృందాల్లో 165 మంది సిబ్బంది పాల్గొన్నారు. 4832 సర్వీసులను తనిఖీ చేశారని ఈఈలు చెప్పారు. దాడుల్లో డీఈఈ కె.రవికుమార్, మల్లిఖార్జునప్రసాద్, శ్రీనివాసరావు, వీరేశ్వరరావు, ఏఈ మస్తాన్ వలి, కోటేశ్వరరావు, సతీష్‌కుమార్, శివశంకర్ పాల్గొన్నారు.



డ్రాగెన్ ఫ్రూట్స్ పంటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి వెంకటరావు తదితరులు

కార్బండిజంతో ఎండు తెగులు నివారణ

● జిల్లా ఉద్యానశాఖ అధికారి వెంకటరావు

మాచవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): జామలో ఎండు తెగులు ఆశించిన చెట్లకు ఒక గ్రాము కార్బండిజం లేదా మూడు కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి కలిపి మందు ద్రావణాన్ని చెట్టు మొదట్లో పోయాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి ఐ వెంకటరావు రైతులకు సూచించారు. గురువారం మండలంలోని గంగిరెడ్డిపాలెం, పిన్నెల్లి, వేమవరం రైతుసేవా కేంద్రాల పరిధిలోని జామ, డ్రాగెన్‌ఫ్రూట్స్, ఆయిల్‌ఫాం పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు.కార్యక్రమంలో పిడుగురాళ్ళ హార్టికల్చర్ అధికారి అంజలిబాయి, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ కరుణకుమారి, ప్రభాకరరెడ్డి, సాగర్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్తం...

● పిడుగురాళ్ల: అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ సమస్యల పరిష్కారానికై సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఐలాండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు.కార్యక్రమంలో శ్రీను, హజ్రా, శాంతమణి, జయశ్రీ, శాంతకుమారి, నాగమణి, శైలజ, భూలక్ష్మీ, వరలక్ష్మీ, చౌడేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

● దాచేపల్లి: మండలంలో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. గురువారం జరిగిన ఆయా కార్యక్రమాల్లో పల్నాడు జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, రాజారావు, ఆనంద్ కుమార్, ఏషయ్య, శ్రీనివాసరావు, రాంబాబు, మస్తాన్‌వలి, వెంకటరావు, సుధాకరరెడ్డిపాల్గొన్నారు.

● సత్తెనపల్లి: అనధికార లేఅవుట్‌లు, ప్లాట్ల స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వ జీవో ప్రకారం ఎల్ఆర్ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది జూన్ 30వ తేదీ లోపు అనధికార వెంచర్లు, ప్లాట్ల రిజిస్ట్రేషన్ జరిగిన స్థల యజమానులు మాత్రమే ఎల్ఆర్ఎస్‌కు అర్హులన్నారు. 90 రోజుల్లోగా లైసెన్స్ కలిగిన ప్లానర్స్ లేదా వ్యక్తిగతంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తుల నమోదుకు గడువు ఉందన్నారు. అనధికార లేఅవుట్‌లు, కనీసం రూ 10వేలు చెల్లించి అక్టోబరు 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

● ఈనెల 23వ తేదీ శనివారం స్థానిక మార్కెట్ యార్డులో స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణం విజయోత్సవ సభ జరుగుతుందని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి భీమినేని వందనాదేవి, తెలుగు మహిళలు తెలిపారు. గురువారం టీడీపీ ప్రజావేదికలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ శనివారం సాయంత్రం 3 గంటలకు మార్కెట్‌యార్డులో ఈ సభ జరుగుతుందని తెలిపారు. నియోజక వర్గంలోని తెలుగు మహిళలు, కూటమి నేతలు, కార్యకర్తలు జయప్రదం చేయాలన్నారు.

● సత్తెనపల్లిలో గౌడ కులస్తులకు ఒక బార్‌ను రిజర్వేషన్ క్యాటగిరిలో ప్రభుత్వం కేటాయించిందని ఎక్సైజ్ సీఐ పీ విజయకుమార్ గురువారం విలేకరులకు తెలిపారు. పట్టణంలోని గౌడ కులస్తులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

● పట్టణానికి చెందిన న్యాయవాది బత్తుల ఆదినారాయణను సత్తెనపల్లి సివిల్ కోర్టు తరపున ప్రభుత్వ న్యాయవాదిగా నియమిస్తూ గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆదినారాయణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఏజీపీ పదవి అప్పగించిన ఎమ్మెల్యే కన్నాకు కృతజ్ఞతలు తెలిపారు.

● ముప్పాళ్ళ: భూముల రీసర్వేలో భాగంగా ముసాయిదా డ్రాఫ్ట్, లాండ్ రికార్డు మీద మండలంలోని నార్నెపాడు పాలకేంద్రం వద్ద ఈనెల 22వ తేదీ సాయంత్రం 6గంటలకు గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నగేష్ గురువారం తెలిపారు.

● సత్తెనపల్లి రూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో నల్లబర్లీ పొగాకు కేంద్రంలో గురువారం కేంద్రానికి 85 బేళ్ళు రాగా 52 బేళ్ళను కొనుగోలు చేసినట్లు బయ్యర్ సుబ్బారావు తెలిపారు. క్వింటా పొగాకు గరిష్టంగా రూ.9వేలు, కనిష్టంగా రూ.6వేలకు కొనుగోలు చేశామన్నారు. తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీనివాసరావు, యార్డు అధికారులు పరిశీలించారు.

● మంత్రి మనోహర్ నుంచి ఉత్తమ అధికారిగా ప్రశంసాపత్రం అందుకున్న మున్సిపల్ కమిషనర్ ఆనందకుమార్‌ను టీడీపీ ఎస్సీసెల్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

● మండలంలోని కంకణాలపల్లిలో డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్(డీఎల్ఆర్)పై అభ్యంతరాల కొరకు గురువారం గ్రామసభ నిర్వహించారు. అభ్యంతరాలు ఉంటే అప్పీలు చేసుకోవాలని తహసీల్దార్ చక్రవర్తి సూచించారు.

● మాచర్ల రూరల్: ఉత్తమ అధికారిగా అవార్డు పొందిన తహసీల్దార్ కిరణ్‌కుమార్‌ను గురువారం దళిత బహుజన ప్రజాసంఘాల నేతలు ఘనంగా సన్మానించారు.

● దుర్గి: దుర్గిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఐఈసీ క్యాంపెయిన్ నిర్వహించారు. విద్యార్థులకు హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రీడ్స్ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ కోమలి, అవుట్‌రీచ్‌వర్కర్లు, పీర్ ఎడ్యుకేటర్ సునీతకుమారి, ప్రిన్సిపాల్ వేణు పాల్గొన్నారు.

● మాచర్లటౌన్: ఉత్తమ అధికారిగా అవార్డు పొందిన మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబును గురువారం పట్టణంలోని మీనాక్షి కంటి వైద్యశాల చైర్మన్ చిరుమామిళ్ల కృష్ణయ్య సన్మానించారు.

● రెంటచింతల: గురువారం మండలంలోని పాలువాయి గ్రామంలో రూ.2,62,529 బోనస్ డైరెక్టర్ పి.శ్రీనివాసరావు పాల ఉత్పత్తిదారులకు పంపిణీ చేశారు.

● అచ్చంపేట: మండలంలోని చల్లగరిగ, మాదిపాడు గ్రామాల్లో గల 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో 22, 23 తేదీల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ శివకోటిరెడ్డి తెలిపారు.

● క్రోసూరు: హసానాబాద్‌లో పోలేరమ్మ తల్లి కొలుపులు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు సమర్పించారు.

● సాగుకు పొలాల్లో తవ్విన బావులకు రక్షణ వలయాలు ఏర్పాటుచేయాలని తహసీల్దార్ వి.వెంకటనాగరాజు గురువారం కోరారు. బావుల చుట్టూ తప్పనిసరిగా రక్షణ గోడలు, ఫెన్సింగ్ వంటివి ఏర్పాటు చేసుకోవాలన్నారు.

● పెదకూరపాడు: భక్తిశ్రద్ధలతో మాసశివరాత్రి మహన్యాస రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. 75 తాళ్ళూరులో కాశీఅన్నపూర్ణేశ్వరిదేవస్థానంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు.



అమరావతి: నిమజ్జన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నిబంధనల మేరకే చవితి విగ్రహాల ఏర్పాటు

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): నిబంధనల మేరకు మండలంలో వినాయక చవితి ఉత్సవ కమిటీలు పండుగ ఏర్పాట్లను చేసుకుని ప్రశాంత వాతావరణంలో ఉత్సవాన్ని జరుపుకోవాలని సీఐ అచ్చియ్య, తహసీల్దార్ దానియేలు తెలిపారు. గురువారం ఎంపీపీ ఎం హనుమంతరావుతో కలసి ధ్యానబుద్ధ ప్రాజెక్టు వద్ద నదీతీరంలో వినాయక నిమజ్జన ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ నిమజ్జనం పూర్తయ్యే వరకు ఉత్సవ కమిటీలదే బాధ్యతన్నారు. పోలీసులు నిర్ణయించిన మార్గంలోవిగ్రహాలను తెచ్చి నిమజ్జనం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజశేఖర్, ఆర్ఐ శిరోమణి, పీఏస్‌లు పాల్గొన్నారు.

● బెల్లంకొండ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా ఉండాలని ఎస్ఐ ప్రవీణ్ పేర్కొన్నారు. మండపాల వద్ద మైక్ అనుమతి తీసుకోవాలన్నారు. రహదారులకు అడ్డంగా మండపాలను ఏర్పాటుచేయరాదని, విగ్రహాల వద్ద రాత్రిళ్ల కాపలా ఉండాలని తెలిపారు. ఊరేగింపునకు అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ పేర్కొన్నారు.

● కారంపూడి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 27వ తేదీన వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మండపాల వద్ద వినాయకుని విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరని సీఐ శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక సర్కిల్ కార్యాలయలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కారంపూడి సర్కిల్ పరిధిలోని కారంపూడి, దుర్గి, రెంటచింతల మండలాల పరిధిలో ఏర్పాటు చేయనున్న వినాయకుని విగ్రహాల మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిర్వాహకులు విద్యుత్, పంచాయతీ, అగ్నిమాపక శాఖల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. వినాయకుని మండపాలు, నిమజ్జన ఊరేగింపులో డీజేలకు అనుమతి లేదన్నారు. మీసేవా ద్వారా లేదా పోలీస్‌స్టేషన్లో అనుమతి తీసుకోవాలన్నారు. సీఐ వెంట ఎస్ఐ వాసు ఉన్నారు.

1993లో రెవెన్యూ అధికారులు పట్టాలు ఇచ్చారు

● నేడు అడ్డుకుంటున్న అటవీశాఖ అధికారులు
● నలిగిపోతున్న నిరుపేద కుటుంబాలు

అచ్చంపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్ళచెరువు రెవెన్యూ పరిధిలోని చెరుకుపాలెంకి చెందిన 55మంది రైతులకు డీకే పట్టాలు మంజూరు చేశారు. 320, 321, 332 సర్వే నెంబర్లలోని 18మంది రైతులు వారి జీవనోపాధి సరిగాలేక వలసపోవడంతో ఇప్పుడు సాగు చేసుకొనేందుకు ఆటంకాలు ఏర్పడ్డాయి. నేడు పట్టాలు పట్టుకొని సాగు చేసుకొనేందుకు రైతులు ముందుకు రావటంతో అటవీ శాఖ అధికారులు ఆ భూములు అటవీ భూములంటూ ఈ 18మంది రైతులను అడ్డుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం నిరుపేద రైతుల పక్షాన వ్యవసాయసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వంకాయలపాటి రాణి, పల్నాడు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి జీ రవిబాబు, క్రోసూరు మండలానికి చెందిన వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఈ భూములను పరిశీలించారు. ఈ క్రమంలో డీఆర్వో కుసుమకుమారి, అచ్చంపేట ఫారెస్టు సెక్షన్ అధికారులు ఈ రైతులను అడ్డుకోవటంతో గందరగోళం ఏర్పడటంతో ఈ పంచాయితీ పోలీసు స్టేషన్‌కు చేరింది. పోలీసుల సూచనల మేరకు ఫారెస్టు అధికారులు, రైతులు, వ్యవసాయ సంఘ నాయకులు రెవెన్యూ కార్యాలయానికి చేరారు. తహసీల్దార్ కే శ్రీనివాసరావు ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరిస్తానని రైతులకు, సంఘ నాయకులకు తెలిపారు. కార్మిక సంఘ నాయకులు కే నరసరాజు, కేకే రెడ్డి, టీ హనుమంతరావు, వెంకటేశ్వర్లుతో పాటు రైతులు ఆయుధం తిరుపతయ్య, కే ఆదాము, కేకే రెడ్డి, వల్లపు వెంకటేశ్వర్లు, సుంకర భానురావు తదితరులు పాల్గొన్నారు.



చెరుకుంపాలెం రైతుల భూముల వివరాలను సేకరిస్తున్న ఫారెస్టు అధికారులు

రెండు రోజుల్లో రోడ్డు మరమ్మతులు పూర్తి

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీవర్షాలతో మండలంలోని నెమలికల్లు-మండెపూడి గ్రామాల మధ్య ఉన్న బీటీ రోడ్ కోతకు గురై పాఠశాలకు వెళ్లాల్సిన వందమంది విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనానికి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ స్పందించారు. పంచాయితీరాజ్ ఏఈ రమేష్‌తో మాట్లాడి రోడ్డు మరమ్మతులు చేయించారు. దీంతో రెండు గ్రామాల ప్రజలు, నెమలికల్లు గ్రామ విద్యార్థులు ఎమ్మెల్యే ప్రవీణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



మరమ్మతులు చేసిన నెమలికల్లు-మండెపూడి రహదారి

తల్లీ కుమారుడిని అనాథాశ్రమంలో చేర్పించిన స్నేహితులు

బెల్లంకొండ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఆస్తిపాస్తులు, బంధువులున్నా పట్టించుకొనే నాథుడే లేకపోవడంతో స్నేహితులు వారిబాధలు చూడలేక తల్లీ కుమారుడిని అనాథాశ్రమంలో చేర్పించారు. గురువారం మండలంలోని వెంకటాయపాలెంకి చెందిన రాతల హనుమాన్‌బాయ్ ఆమె కుమారుడు రామునాయక్ కొంతకాలంగా పక్షవాతంతో బాధ పడుతున్నాడు. బంధువులు, అన్నదమ్ములు పట్టించుకోక పోవటంతో స్నేహితులు గుర్తించి రాజుపాలెం మండలం కొండమోడు దీనమ్మ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అనాథాశ్రమంలో చేర్పించారు. సొసైటీ చైర్మన్ శంకరరావు ఇరువురిని ఆశ్రమంలో చేర్చుకున్నారు.



తల్లి కుమారుడిని అనాథాశ్రమంలో చేర్పిస్తున్న స్నేహితులు

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

మాచర్ల రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెలుగు కార్యాలయంలో గురువారం మాచర్ల, వెల్దుర్తి మండలాల రైతు సేవా కేంద్రం సిబ్బందికి ప్రకృతి వ్యవసాయంపై శిక్షణా కార్యక్రమం నిర్వహిచారు. జిల్లా శిక్షకుడు సైదయ్య, ఏవో పాపకుమారి పలు సూచనలు చేశారు. ప్రతి రైతు అంతర పంటల విధానం ఆచరించాలని, దీని వల్ల అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. మిరప పంటలో అంతర పంటలుగా ఉల్లి, బంతి, కొత్తిమీర, ముల్లంగి, సజ్జ వేయాలన్నారు. దీని ద్వారా మిరపను ఆశించే తామర పురుగురు, రసంపీల్చే పురుగులను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో డివిజన్ మాస్టర్ ట్రైనర్ వినోద, యూనిట్ ఇన్‌చార్జులు గురుమూర్తి, అనంతలక్ష్మీ, కోటేశ్వరరావు, షేక్ అబ్దుల్ నబీ, భాస్కర్, వాణి, వెంకయ్య పాల్గొన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం

రాజుపాలెం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గంజాయి, మత్తు పదార్థాలతో యువత భవిష్యత్తు నాశనం చేసుకుంటుంది.. మత్తు పదార్థాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు.. క్రయవిక్రయాల ముఠాలను గుర్తించి ఆరెస్టు చేస్తున్నారు.. యువత గంజాయి జోలికి పోవొద్దని, పోలీసులకు చిక్కి కేసులు నమోదైతే ఉద్యోగాలకు అనర్హులవుతారని మండలంలోని రాజుపాలెం, కొండమోడు తదితర గ్రామాలలో ఉన్న విద్యాలయాలలో విద్యార్థులకు గత రెండు రోజుల నుండి ఎస్సై వేణుగోపాల్ అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు అక్రమార్కులు గంజాయి రవాణాకు విద్యార్థులను వాడుకుంటున్నారని తెలిపారు. విద్యార్థులు అప్రమత్తంగాఉండాలని సూచించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

సత్తెనపల్లి రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను అధికారుల బృందం గురువారం తనిఖీ చేశారు. గోదాములోని ఎరువుల నిల్వలను, ఈ పాస్ మిషన్‌లోని స్టాక్ నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో బీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎంఆర్‌పీ ధరలకే ఎరువుల అమ్మకాలు జరపాలని షాపు నిర్వాహకులను ఆదేశించారు. తనిఖీల్లో తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పల్నాడు జిల్లాకు 5 రిజర్వుడు బార్లు

నరసరావుపేట లీగల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రకటించిన నూతన ఎక్సైజ్ పాలసీలో పల్నాడు జిల్లాకు గీత ఉప కులాలకు 5 రిజర్వుడు బార్లు కేటాయించినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మణికంఠ గురువారం తెలిపారు. నరసరావుపేట, సత్తెనపల్లి మున్సిపాలిటీలలో గౌడ్ కులానికి, చిలకలూరిపేట, మాచర్ల, దాచేపల్లి నగర పంచాయతీలలో గౌడకులానికి ఒక్కొక్కటి చొప్పున రిజర్వుడు బార్లు కేటాయించినట్లు ఆయన తెలిపారు. ఈనెల 29వ తేదీ సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. ఈనెల 30వ తేదీ కలెక్టరేట్లో డ్రా తీస్తారని అన్నారు.



ప్రత్యేక అలంకరణలో గంగా అన్నపూర్ణాదేవి, నరసింగపాడులో మరకతలింగ చంద్రమౌళేశ్వర స్వామి విశ్వరూప దర్శనం

మరకత లింగ చంద్రమౌళేశ్వరునికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం

నకరికల్లు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మాస శివరాత్రి సందర్భంగా మండలంలోని నరసింగపాడులో గంగా అన్నపూర్ణ సమేత మరకత లింగ చంద్రమౌళేశ్వరునికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. రుద్రహోమం, చండీ హోమం నిర్వహించారు. భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివార్లను విశేషంగా అలంకరించారు.

సత్యసాయి సేవా సమితి సేవలు అభినందనీయం

● ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ విజయలక్ష్మి

మాచర్లటౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవా సమితి సేవలు అభినందనీయమని మాచర్ల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ విజయలక్ష్మి అన్నారు. భగవాన్ శ్రీసత్యసాయిబాబా జయంతి వేడుకల్లో భాగంగా గురువారం మాచర్ల సమితి భజన మండలి అధ్వర్యాన పట్టణంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పట్టణంలోని నగరవనంలో సుమారు 600 మొక్కలను నాటారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు సురేంద్ర, జిల్లా అధ్యక్షుడు మాధవ్, కల్పనా చౌదరి, అనిల్‌కుమార్, జక్కా శ్రీనివాసరావు, కొత్తమాసు వీరాంజనేయులు, ప్రిన్సిపాల్ రమాదేవి, సూరే యలమంద, మేడం నాగేశ్వరరావు, కాలంగి కిరణ్‌కుమార్, కజ్జం గురవయ్య, కొత్త శ్రీనివాసరావు, జక్కా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ విజయలక్ష్మి

యార్డు చైర్మన్ ప్రమాణ స్వీకారానికి భారీగా తరలి రావాలి

● నియోజక వర్గ టీడీపీ నాయకుడు సాయిబాబు

బెల్లంకొండ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): క్రోసూరు మార్కెట్‌యార్డులో ఈనెల 24న జరిగే యార్డు చైర్మన్ ప్రమాణ స్వీకారానికి బెల్లంకొండ మండలం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని నియోజకవర్గ టీడీపీ నాయకులు కంచేటి సాయిబాబు పేర్కొన్నారు. గురువారం బెల్లంకొండ పార్టీ కార్యాలయంలో మండల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్‌గా షేక్ జెరీనా ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. సమావేశంలో రాష్ట్ర మైనార్టీ సెల్ టీడీపీ ప్రధానకార్యదర్శి మస్తాన్ షరీఫ్, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, అక్కల వెంకటరామిరెడ్డి, ఓర్సు ఆనంద్, పీఎస్‌కే రసూల్, బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, తమ్మిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు..

క్రోసూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడి పనిచేసిన వారికి తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందని జిల్లా టీడీపీ నాయకులు కంచేటి సాయిబాబు అన్నారు. గురువారం క్రోసూరు మార్కెట్‌యార్డులో నియోజకవర్గంలోని ఐదు మండలాల పార్టీ నాయకులతో ఆయన సమావేశం అయ్యారు. ఈనెల 24న యార్డు పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి వేలాదిగా కూటమి శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వివిధ మండలాల టీడీపీ అధ్యక్షులు మొగల్ జాన్, నందిగం ఆశీర్వాదం, బ్రహ్మయ్య, బెల్లంకొండ క్రోసూరు టీడీపీ నాయకులు మస్తాన్ షరీఫ్, గుడిపాడు బాషా పాల్గొన్నారు.

టౌన్ వెండింగ్ కమిటీ సమావేశం

గురజాలటౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో గురువారం చైర్మన్ బడేజాని ఆధ్వర్యాన టౌన్ వెండింగ్ కమిటి సమావేశం నిర్వహించారు. టౌన్ వెండింగ్, పోలీసు శాఖ, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు. వెండర్స్ రుణాలపై సమావేశంలో చర్చించారు. వీధి విక్రయదారుల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు కమిటి సభ్యులు తెలిపారు. సమావేశంలో కమిషనర్ శివన్నారాయణ, బ్యాంకు మేనేజర్ హిమబిందు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశం నిర్వహిస్తున్న చైర్మన్ బడేజాని

పాల ఉత్పత్తిదారులు, మహిళలకు చీర, సారె పంపిణీ

నకరికల్లు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కండ్లకుంటలో పాల ఉత్పత్తిదారులకు, మహిళలకు చీర, సారెలను బహుమతులుగా సంగం డెయిరీ అధ్యక్షుడు గాలి వెంకటరావు గురువారం పంపిణీ చేశారు. 2024-25 సంవత్సరంలో రూ.12 లక్షలు బోనస్ రూపంలో పంపిణీ చేశారు. మిగిలిన నిధులను మహిళలకు చీర, సారెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంగం డెయిరీ డైరెక్టర్ పోపూరి శేషగిరికుమారి, మేనేజర్ కాట్రు నరేష్‌బాబు, రొంపిచర్ల ఇన్‌చార్జ్ కిరణ్‌కుమార్, నాని, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



కండ్లకుంటలో చీరలను పంపిణీ చేస్తున్న సంగం డెయిరీ అధ్యక్షుడు గాలి వెంకటరావు



రెవెన్యూ సిబ్బందితో సమావేశ మైన ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి

రెవెన్యూ సమస్యలపై తక్షణమే స్పందించండి

● ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి

క్రోసూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం అధికారులు, సిబ్బంది, వీఆర్‌వోలు తక్షణమే స్పందించాలని ఆర్డీవో రమణకాంత్ రెడ్డి అన్నారు. గురువారం క్రోసూరు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది, వీఆర్‌వోలతో సమావేశమయ్యారు. నాగవరంలో ఇటీవల జరిగిన ఫిర్యాదుల దినోత్సవంలో భూవివాదానికి సంబంధించి మిరియాల శ్రీనివాసరావు అర్జీ సమర్పించగా గ్రామానికి వెళ్ళి సంబంధిత భూములను ఆయన పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ వేముల వెంకటనాగరాజు, డీటీ శ్రీనివాసరావు, వీఆర్‌వోలు ఉన్నారు.

విధులకు సచివాలయ సిబ్బంది డుమ్మా

పెదకూరపాడు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో సచివాలయ సిబ్బంది డుమ్మాకొట్టిన సంఘటన మండలంలోని గారపాడులో గురువారం జరిగింది. ఎంపీడీవో నాగం సోమయాజులు, ఈవోపీఆర్‌డీ శరత్‌బాబులు మండలంలోని గారపాడు సచివాలయాన్ని మూడు గంటల సమయంలో తనిఖీ చేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్ విధుల్లో ఉండగా పంచాయతీ కార్యదర్శి విధుల్లో భాగంగా వేరే గ్రామానికి వెళ్ళినట్టు ఎంపీడీవో వివరించారు. సచివాలయ సిబ్బంది ఆరుగురు విధులకు గైర్హాజరయ్యారని, అగ్రికల్చర్ అసిస్టెంట్ మాత్ర 3:30 గంటల తరువాత విధులకు హాజరైనట్టు వివరించారు. రోజువారి మూమెంట్ రిజిస్టర్‌లో కూడా ఏమీ నమోదు చేయలేదన్నారు. విధులకు ఎవరు గైర్హాజరైన చర్యలు తప్పవని ఎంపీడీవో హెచ్చరించారు.

రాజముద్రతో పాస్‌పుస్తకాలు సిద్ధం

పిడుగురాళ్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గురజాల రెవెన్యూ డివిజన్ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో రీసర్వే జరిపిన రైతులకు అప్పటి సీఎం జగన్ బొమ్మతో పాస్‌పుస్తకాలు పంపిణీ చేశారు. భూములు మావైతే జగన్ బొమ్మ ఏంటంటూ కొందరు రైతులు పుస్తకాలను తీసుకోలేదు. అంతేకాకుండా రీసర్వేలో భూ వ్యత్యాసం కూడా వుంది. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ప్రభుత్వ రాజముద్రతో వున్న కొత్త పాస్‌పుస్తకాలు రెవెన్యూ కార్యాలయానికి పంపాయి. గురజాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని గురజాల, మాచర్ల నియోజకవర్గాలలోని 9 గ్రామాలలో రీసర్వే పూర్తికాగా, 4,321 మంది రైతులకు రాజముద్రతో కొత్త పుస్తకాలను పంపిణీ చేసేందుకు అధికారులు సిద్ధంగా వున్నారు.

సొసైటీ అధ్యక్షుల ప్రమాణస్వీకారం

పిడుగురాళ్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పెద అగ్రహారం సొసైటీ చైర్‌పర్సన్‌గా పిన్నమూర్తి మరియమ్మ ప్రభాకర్, సభ్యులు బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. సొసైటీ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో బ్యాంక్ సూపర్‌వైజర్ జక్కుల వెంకయ్య చైర్మన్, సభ్యులు పుల్లయ్య, బ్రహ్మయ్యలతో ప్రమాణస్వీకారం చేయించారు. పిడుగురాళ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ తురకా వీరస్వామి, సొసైటీ చైర్మన్లు వడ్డవల్లి సర్వేశ్వరరావు, యడ్లపల్లి శివన్నారాయణ, గండికోట వెంకటేశ్వర్లు, డిసి కమిటీ చైర్మన్ గండికోట వెంకటేశ్వర్లు, పిల్లి చెన్నారావు, మేకల సాంబశివరావు, మేకల రాంబాబు, మార్కెట్ యార్డు డైరెక్టర్ పాదర్తి రాజేశ్వరి, కొరముట్ల ఆంజనేయులు, కె.హనుమంతరావు, డి.శివ, సొసైటీ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



సొసైటీ అధ్యక్షులను సన్మానిస్తున్న ఏఎంసీ చైర్మన్ వీరస్వామి, సర్వేశ్వరరావు, వెంకటేశ్వర్లు తదితరులు

అన్నదాతలకు యూరియా సరఫరా చేయాలి

● మండల పరిషత్ సమావేశంలో సభ్యుల డిమాండ్

రెంటచింతల,ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు యూరియాను సకాలంలో అందచేయాలని ఇంతవరకు సొసైటీలకు సరఫరా చేయలేదని దీంతో రైతుల అగచాట్లు అన్నీఇన్నీ కావని ఎంపీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఉప ఎంపీపీ వై.శౌరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున ఓవర్ హెడ్ ట్యాంక్‌లను శుభ్రం చేయాలని, ఘనవ్యర్థాల షెడ్లను వాడుకలోకి తేవాలని, కొన్నిచోట్ల కాలువల్లో మంచినీటి పైప్‌లు వేశారని వాటిలోకి మురుగునీరు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసరావు, ఎంపీటీసీలు ఎం.అచ్చమ్మ, డానియేల్, లావు రత్నాకర్, ఆర్.సీతమ్మ, షేక్ సుబాని, కోఆప్షన్ బిక్కున్ వలి, డాక్టర్ కృష్ణారెడ్డి, ఏఈలు మస్తాన్ వలి, శ్రీనివాసరావు, వెంకటేష్, వెంకటేశ్వరరెడ్డి, ఏపీవో వెంకటేశ్వరరావు, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో రూ.60వేల జరిమానా

క్రోసూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): క్రోసూరు నాలుగు రోడ్ల సెంటర్‌లో గురువారం ఎస్ఐ పీ రవిబాబు ఆధ్వర్యంలో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఆరుగురు వ్యక్తులకు రూ.60వేలు జరిమానాలు విధించినట్టు ఎస్ఐ తెలిపారు. బహిరంగంగా మద్యం సేవిస్తున్న నలుగురు వ్యక్తులకు రూ 4వేలు జరిమానా విధించారు. ఎర్రబాలెం గ్రామంలో పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి ఇద్దరిని అదుపులోకి తీసుకొని రూ.1400 స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. పోలీసు సిబ్బంది ఉన్నారు.



క్రోసూరులో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

ఆశావర్కర్ రాజీనామా

బెల్లంకొండ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నె సుల్తాన్ గ్రామానికి చెందిన అంగన్‌వాడీ ఆశావర్కర్ రజినీప్రియ గురువారం తన ఉద్యోగానికి రాజీనామా చేసినట్టు తెలిపారు. తన రాజీనామా పత్రాన్ని చంద్రాజుపాలెం పీహెచ్‌సీ డాక్టర్‌కు పంపినట్టు పేర్కొన్నారు. తన వ్యక్తి గత కారణాల వల్ల రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

మాచర్లటౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందిన సంఘటన వెల్దుర్తి మండలం కొత్తపుల్లారెడ్డిగూడెంలో జరిగింది. వెల్దుర్తి మండలం గుడిపాడుచెరువుకి చెందిన బొజ్జ కొండలు(48) శిరిగిరిపాడు ఆదర్శ పాఠశాలలో వంటమనిషిగా పనిచేస్తున్నాడు. బుధవారం అర్ధరాత్రి కొత్తపుల్లారెడ్డిగూడెం శివారు అటవీప్రాంతంలో అనుమానాస్పద స్థితిలో కొండలు మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా ప్రదేశాన్ని పరిశీలించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కనుమరుగైన కర్మాగారం

'ఈ ఫ్యాక్టరీ ఎంతో కాలం నడవదు. తప్పని సరిగా మూత పడుతుంది.' జంపని షుగర్ ఫ్యాక్టరీ గురించి ఈ మాటలు అన్నది ఎవరో కాదు.. డెల్టా ప్రాంత రాజకీయ వాతావరణాన్ని అవపోసన పట్టిన, ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేసిన అప్పటి సీఎం మర్రి చెన్నారెడ్డి. ఎంతో అనుభవంతో ఆయన అన్న మాటలు.. నేడు వాస్తవం అయ్యాయని రైతులు చెప్పుకుంటున్నారు.

- భూములు ఇచ్చిన రైతుల్లో నిరాశ
- ప్రభుత్వాల తీరును ఎండగడుతున్న రైతులు
- జీతం బకాయి, డిపాజిట్లపై ప్రశ్నలు
- భవిష్యత్ కార్యాచరణపై సందిగ్ధం



మూతపడ్డ షుగర్ ఫ్యాక్టరీ

వేమూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): డెల్టా ప్రాంతంలో సహకార రంగంలో అతి పెద్దది అయిన జంపని షుగర్ ఫ్యాక్టరీ ఈనాడు పూర్తిగా కనుమరుగైంది. సహకార రంగం, రైతుల భాగస్వామ్యం ద్వారా 77 ఎకరాల భూముల్లో చక్కెర ఫ్యాక్టరీ నిర్మాణం చేశారు. 1974లో ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి చేతుల మీదుగా ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దాదాపు పదేళ్లకు నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ ఫ్యాక్టరీ.. 1984లో మొదటి క్రషింగ్ ప్రారంభించింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 26 మండలాల పరిధి నుంచి ఫ్యాక్టరీకి రైతులు చెరకు సరఫరా చేశారు. రోజుకు లక్ష నుంచి 1,20,000 టన్నుల వరకు చెరకు క్రషింగ్ జరుగుతూ ఉండేది. ప్రభుత్వ ఆర్థిక సాయంతో పాటు రైతులు కూడా 12,000 మంది షేర్ హోల్డర్స్‌గా చేరి ఫ్యాక్టరీకి తమ వతు సాయం అందించారు.

ఐక్యతా లోపం..ఫ్యాక్టరీకి శాపం..

ప్రభుత్వాలు, స్థానిక ప్రజా ప్రతినిదులు, ఉద్యోగుల్లో ఐక్యత లోపించడం వల్ల ఫ్యాక్టరీ నిర్వహణ విషయంలో అనేక మార్లు సమస్యలు ఎదురయ్యాయి. క్రమేపి వివాదాలు చోటు చేసుకోవడం ఫ్యాక్టరీ క్రషింగ్ సామర్థ్యం రాను రాను తగ్గిపోయింది. రైతుకు గిట్టుబాటు ధర రాకపోవడం, కూలీల సమస్య ఏర్పడటం, ఇలాంటి అనేక కారణాల వల్ల రైతులు పూర్తిగా చెరకు సాగు నిలిపివేశారు. అప్పటి ప్రభుత్వం ఫ్యాక్టరీని 2003లో జైపూర్ షుగర్‌కు అప్పగించడం జరిగింది. వారి నుంచి మళ్లీ ఫ్యాక్టరీని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని.. 2004 క్రెబ్స్ కంపెనీకి కట్టపెట్టడం జరిగింది. వారి నుంచి 2005లో మళ్లీ సహకార రంగంలోకి తీసుకున్నారు. 1984 నుంచి 2012 వరకు అనేక ఒడిదుడుకులతో నడిచిన ఫ్యాక్టరీని 2012లో పూర్తిగా మూసి వేశారు.

భవిష్యత్తు ఏంటీ..?

షుగర్ ఫ్యాక్టరీ భవిష్యత్ కార్యాచరణ ఏమిటీ? అంటూ రైతులు ప్రజలు ప్రశ్నిస్తూ ఉండగా.. భూములు ఇచ్చిన రైతులు మాత్రం పూర్తి నిరాశతో ప్రభుత్వాల తీరును ఎండ గడుతున్నారు. ఫ్యాక్టరీ నడిచిన కాలంలో పర్మినెంట్ ఉద్యోగులు 150 మంది, సీజనల్ ఉద్యోగులు 80, ఎన్ఎంఆర్‌లు 250 మందితో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూలీలకు ఉపాధి లభిస్తూ ఉండేది. దిక్కుతోచని ఉద్యోగులు జీతాలు కూడా లేక అలమటిస్తూ చివరికి వీఆర్ఎస్‌కు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో పాటు సహకార రంగంలోని ఫ్యాక్టరీలో పని చేస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ ఇతర ఉద్యోగులను పూర్తిగా తొలగించి.. పర్యవేక్షణ నిమిత్తం 2023లో లిక్విడేటర్‌ను ఏర్పాటు చేశారు. నెమ్మదిగా ఉద్యోగులకు వీఆర్ఎస్ అమలు పరచడం జరిగింది.



ఫ్యాక్టరీ నిర్మాణాలను యంత్రాలతో తొలగింపు..

ఈ తరుణంలో వారికి జీతభత్యాల బకాయి దాదాపు రూ.14.30 కోట్ల వరకు అందాల్సి ఉంది. ఇప్పటి వరకు కేవలం రూ.3.50 కోట్లు మాత్రమే వారి ఖాతాలకు జమ చేశారు. దాదాపు రూ.185 కోట్ల అప్పు ప్రభుత్వం ఫ్యాక్టరీకి వివిధ రూపాల్లో ఇచ్చింది. 12 వేల మంది రైతులకు రూ.12 కోట్ల మేర షేర్ తిరిగి ఇవ్వాల్సి ఉంది. అంతే కాకుండా చెరకు తోలిన రైతుకు చెల్లించే ప్రతి టన్ను ధర నుంచి కొంత డబ్బును కట్ చేసి నాన్ రిఫండబుల్ డిపాజిట్ చేశారు. ఆ డబ్బును కూడా రైతులకు చెల్లించాల్సి ఉంది.

ప్రభుత్వం ఏం చేస్తుంది..?

చివరకు 77 ఎకరాల భూమి ఫ్యాక్టరీ పరిధిలో ఉండగా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం చేస్తుందని ఈ ప్రాంత ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఫ్యాక్టరీ పరిధిలో ఉన్న మొక్కలను తొలగించేందుకు రూ.55 లక్షలకు టెండర్ పిలిచి వాటిని తొలగించే ప్రక్రియను చురుకుగా కొనసాగిస్తున్నారు. తుప్పు పట్టిన యంత్రాలు, గోడలు, షెడ్లు ఇతర భవనాలు పూర్తిగా తొలగించేందుకు టెండర్ ద్వారా రూ.9 కోట్లకు కాంట్రాక్టర్‌కు అప్పగించారు.



షుగర్ ఫ్యాక్టరీ ఉద్యోగుల క్వార్టర్స్ గేటు

హలో..ఉద్యోగం చేస్తారా?

● కౌశలం(వర్క్ ఫ్రం హోం)..ఫోన్ కాల్స్ ● ఆసక్తి కనబరుస్తున్న నిరుద్యోగులు ● ఇప్పటికే ఉద్యోగాలున్నాయని కొందరు..

● తమ ప్రమేయం లేకుండానే సర్వే చేశారని మరికొందరు..

గుంటూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక రంగంలో వచ్చిన మార్పులతో ప్రజలు ఇంటి వద్దనే ఉండి ఉద్యోగం చేసుకొనే వాతావరణాన్ని కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలుకు కార్యరూపం ఇస్తూ వర్క్ ఫ్రం హోం సంస్కృతిని విస్తరింప చేసేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టింది. వివిధ కంపెనీలతో ఒప్పందాలు చేసుకొని 10వ తరగతి నుంచి పీజీ విద్యార్హతలున్న వారికి ఈ అవకాశాన్ని కల్పిస్తోంది. ఇందుకోసం కౌశలం అనే డ్యాష్ బోర్డుని ఏర్పాటు చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన వర్క్ ఫ్రం హోం డోర్ టూ డోర్ సర్వేలో ఆసక్తి కనబరిచిన వారందరికి కొద్ది రోజులుగా గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఫోన్లు చేసి విద్యార్హత సర్టిఫికెట్లు తీసుకొని రావాలని సమాచారం అందిస్తున్నారు. దీంతో చాలామంది నిరుద్యోగులు సచివాలయాలకు వెళుతున్నారు.

మూడు జిల్లాల్లో.. మూడు లక్షల మంది..

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో కలిపి దాదాపుగా మూడు లక్షల మందికి వర్క్ ఫ్రం హోం ద్వారా ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం వివిధ కంపెనీలతో టైఅప్ అవుతోంది. గుంటూరు జిల్లాలో 1,27,804, పల్నాడు జిల్లాలో 85,098, బాపట్ల జిల్లాలో 91,554 మందికి వర్క్ ఫ్రం హోం కల్పించేందుకు లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా సర్వేలో ఆసక్తి కనబరిచిన వారిలో ఎవరెవరు సిద్ధంగా ఉన్నారనేది తెలుసుకోవడానికి సచివాలయాల సిబ్బంది ఫోన్ కాల్స్ చేస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని ఇబ్బందులు కూడా తలెత్తుతున్నాయి. సచివాలయాల సిబ్బంది సమూలంగా మారిపోవడం, ఔత్సాహికులు ఇచ్చిన ఫోన్ నంబర్లకు కాల్స్ వెళ్లకపోవడం వంటివి జరుగుతున్నాయి.

ఆసక్తి, వెనకడుగు, అనుమానం..!

కాగా సర్వే సమయంలో తాము ఇంటి వద్దనే పని చేయడానికి ఆసక్తిగా ఉన్నామని చెప్పిన వారిలో చాలామంది వెనకడుగు వేస్తున్నారు. తమకు వేరే ఉద్యోగం ఉందని, ప్రభుత్వం ఎలాంటి ఉద్యోగం తమకు ఇస్తుందని వంటి ప్రశ్నలు వేస్తున్నారు. సచివాలయాల సిబ్బంది.. ఫోన్ నంబర్‌కు వచ్చిన ఓటీపీ చెప్పని కోరడంతో.. సైబర్ నేరస్థులు ఏమైనా ఫోన్లు చేస్తున్నారా! అని కూడా సందేహాలు వ్యక్తపరుస్తున్నారు. 50 శాతం మందికి పైగా తమకు వర్క్ ఫ్రం హోం ఇష్టమని ఓటీపీ చెప్పి విద్యార్హతల సర్టిఫికెట్ల కాపీలను సచివాలయాల సిబ్బందికి అందజేస్తున్నారు. కాగా ఇప్పటి వరకు గుంటూరు జిల్లాలో 22,564, పల్నాడు జిల్లాలో 14,964, బాపట్ల జిల్లాలో 17,553 మందికి సచివాలయాల సిబ్బంది ఫోన్లు చేసి వారి అభిప్రాయాలను సేకరించారు. ఇంకా మూడు జిల్లాలు కలిపి 2.50 లక్షల మందిని సిబ్బంది నేరుగా/ఫోన్‌కాల్ రూపంలో కలిసి వారి ఆమోదం తీసుకోవాల్సి ఉంది. అప్పుడే వర్క్ ఫ్రం హోంకి ఎంతమంది సిద్ధంగా ఉన్నారనే దానిపై స్పష్టత వస్తుందని అధికారులు తెలిపారు.

అమరావతిలో.. వరద నీటి నిర్వహణపై సంతృప్తి



రాజధాని అమరావతిలో అనంతవరం నర్సరీని పరిశీలిస్తున్న అనుదీప్ గార్గ్

తుళ్లూరు,ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అమరావతిలో పర్యావరణ పరిరక్షణ, వరద నీటి నిర్వహణ చర్యలపై సూపర్‌వైజర్ కమిటీ సంతృప్తి వ్యక్తం చేసింది. గురువారం కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ అడిషనల్ సెక్రటరీ అమన్‌దీప్ గార్గ్ రాజధాని అమరావతిలో పర్యటించారు. ముందుగా ఉండవల్లిలోని రివర్ వాటర్ క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్, కొండవీటి వాగు ఫ్లడ్ పంపింగ్‌స్టేషన్‌ను పరిశీలించారు. సీఆర్డీఏ కమిషనర్ కె.కన్నబాబు అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ పంపింగ్ స్టేషన్ వద్ద అమరావతిలో వరద నీటి నిర్వహణకు చేపట్టిన చర్యలను ఆయనకు వివరించారు. అమరావతిలో వరద నిర్వహణ చర్యలు, భవిష్యత్తు కార్యకలాపాలు, ప్రణాళికలపై సూపర్‌వైజరీ కమిటీ తరఫున విచ్చేసిన అమన్‌దీప్ గార్గ్ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అమరావతి సీడ్ యాక్సిస్ రహదారి సమీపంలో ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్మాణం, గ్రీనరీ, ఎల్పీఎస్ జోన్ల అభివృద్ధి పనులపై ఆరా తీశారు. అనంతరం అమరావతిలోని టిడ్కో గృహ సముదాయాలు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అధికారుల కోసం నిర్మించిన భవనాల సముదాయాలను సందర్శించారు. ట్రాన్స్‌లోకేటెడ్ నర్సరీని అమన్‌దీప్ గార్గ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అమరావతి అభివృద్ధి కార్పొరేషన్ సీఎండీ లక్ష్మీ పార్థసారథి, సీఆర్డీఏ, ఏడీసీఎల్‌లోని వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.


వంతెన పనుల జాప్యంలో రాజకీయ ఒత్తిళ్లు లేవు

● స్ట్రాటజిక్ ఇన్‌ఫ్రా సర్వీసెస్ సంస్థ స్పష్టీకరణ

గుంటూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కొమ్మమూరు కాలువపై గుంటూరు - చీరాల రోడ్డులో 15/8వ కిలోమీటర్ వద్ద నిర్మాణం చేపట్టిన వంతెన పనులు జాప్యం కావడంలో రాజకీయ ఒత్తిళ్ల లేవని పనులు నిర్వహిస్తున్న స్ట్రాటజిక్ ఇన్‌ఫ్రా సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ ఉపాధ్యక్షుడు జీవీ రవికాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పనిని తమ సంస్థ 2023 జూన్‌లో టెండర్లలో పోటీపడి దక్కించుకొందన్నారు. ఈ ఏడాది జనవరి నాటికి రూ. 3.50 కోట్లు విలువ కాగల పనులు పూర్తి చేశామన్నారు. తమ కంపెనీకి ఆర్థికపరమైన సమస్యలు, వంతెన పనులు జరుగుతున్న సమీపంలో మరుగు ప్రవాహం కారణంగా గత 8 నెలల నుంచి పనులకు ఆటంకం కలుగుతోందన్నారు. అంతే తప్పా ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు, బెదిరింపులు లేవని స్పష్టం చేశారు. తమపై నిరాధారమైన ఆరోపణలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

వచ్చిన వరద వచ్చినట్టు..

సాగర్ జలాశయంలో 26 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల



26 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

విజయపురిసౌత్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. గురువారం 4,32,268 క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు 26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 583.10 అడుగులు ఉంది. ఇది 291.95 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9019, ఎడమ కాలువ ద్వారా 6401, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 32,886, 8 క్రస్ట్ గేట్లను 13 అడుగులు, 18 క్రస్ట్ గేట్లను 10 గేట్లు ఎత్తి 3,81,262 ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం అవుట్ ఫ్లో 4,32,268 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

18 రేడియల్ క్రస్ట్ గేట్ల ఎత్తివేత


రెంటచింతల, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి పులిచింతలకు 4,23,513 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు తెలిపారు. ప్రాజెక్టు 15 గేట్లను 4.5 మీటర్లు, 3 గేట్లను 5 మీటర్ల మేర ఎత్తినట్లు వెల్లడించారు. రిజర్వాయర్‌లో 74.31(పూర్తిస్థాయి 75.50) మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 6.2840(పూర్తిస్థాయి 7.080)టీఎంసీలకు సమానమన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో గురువారం 31.87 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఈఈ రాజు తెలిపారు. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 12,800, లీకుల ద్వారా 400, 13 గేట్లను 44.5 మీటర్ల మేర ఎత్తి 4,00,005 క్యూసెక్కులు, మొత్తం 4,13,205 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు.

ప్రకాశం బ్యారేజి వద్ద భారీగా వరద ఉధృతి

● కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక



తాడేపల్లి టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణా నది వరద ఉధృతి భారీగా కొనసాగుతోంది. పులిచింతల ప్రాజెక్టుతోపాటు ఎగువన ఉన్న కీసర, మున్నేరు, వెలగలేరు, తదితర ప్రధాన వాగుల నుంచి గురువారం రాత్రి వరకు 4,05,976 క్యూసెక్కుల వరద నీరు బ్యారేజి రిజర్వాయర్‌కు చేరుకుంది. బ్యారేజి రిజర్వాయర్‌లో 13.7 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా మొత్తం 70 గేట్లను ఎత్తి దిగువకు 4,93,822 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. ప్రకాశం బ్యారేజి వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్నందున దిగువ నదీ తీర ప్రాంత వాసులు లంక భూముల రైతులు మత్స్యకారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

లంక భూములను చుట్టుముట్టిన కృష్ణమ్మ



లంకభూముల చుట్టూ ప్రవహిస్తున్న కృష్ణానది

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అమరావతి, వైకుంఠపురం, కృష్ణా జిల్లా గని ఆత్కూర్ గ్రామాల మధ్య ఉన్న వందలాది ఎకరాల లంక భూములు కొంత మేర నీట మునిగాయి. కృష్ణా నదికి 9లక్షల క్యూసెక్కులకు పైగా వరద ప్రవహిస్తే లంకలో ఉంటున్న రైతులను, పశువులను అమరావతి వైపు తరలించడం జరుగుతుంది. ప్రస్తుతం 7 లక్షల క్యూసెక్కుల వరకు వరద వస్తోంది. నరుకుళ్లపాడు, ఎండ్రాయి వాగులు పెదమద్దూరు వద్ద రెండు వాగులు కలసి వైకుంఠపురం వద్ద నదిలో కలుస్తాయి. ఈ వాగులను మరమ్మతులు చేసి వాగులలో వరద నదిలో కలిసే ప్రదేశంలో (వైకుంఠపురంలోని క్రౌంచగిరికి దక్షిణం వైపున) తాడేపల్లిలో మాదిరిగా ఎత్తిపోతల పథకం నిర్మించి, వాగులలో నీటిని నదిలోకి ఎత్తిపోస్తే పంటల నష్టం తగ్గించవచ్చు.

కృష్ణమ్మ దోబూచులాట

- తగ్గినట్టే తగ్గి పెరిగిన వరద ఉధృతి
- అమావాస్య పోటుతో నదిలో పెరుగుతున్న నీటి మట్టం
- లోతట్టు ప్రాంతాల నుంచి మెరక భూముల్లోకి వరద
- ముంపు బారిన వాణిజ్య పంటలు

కొల్లూరు, భట్టిప్రోలు ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : లంక గ్రామాల రైతులతో కృష్ణమ్మ దోబూచులాడుతోంది. బుధవారం తగ్గినట్టే తగ్గి మళ్లీ గురువారం ఉదయం కృష్ణా నదిలో వరద ఉధృతి మరింత పెరిగింది. దీనికి తోడు అమావాస్య పోటు కారణంగా సముద్రంలోకి వరద నీరు వెళ్లకపోవడంతో నదిలో నీటి మట్టం అంతకంతకు పెరుగుతోంది. దీంతో లోతట్టు ప్రాంతాల నుంచి మెరక భూముల్లోకి ప్రవహిస్తూ వాణిజ్య పంటలను ముంచెత్తుతోంది. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని లంక గ్రామాలు వరద భయంతో వణికిపోతున్నాయి. అరవింద వారధి వద్ద కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో అక్కడ ఉన్న గండి నుంచి వరద నీరు పెసర్లంక, ఆవులవారి పాలెం గ్రామాలను చుట్టుముట్టింది. చింతల్లంక, గాజుల్లంక, పోతార్లంక గ్రామాల వద్ద నది అంచులకు ఏర్పడిన గండ్ల నుంచి వరద నీరు పోటెత్తి అరటి, కంద, పసుపు, తదితర వాణిజ్య పంటలతో పాటు కూరగాయ పంటలను ముంచెత్తుతోంది. చింతల్లంక వద్ద వరద నీటిలోనే మహిళా రైతులు పొలాల్లో ఉన్న పంట ఉత్పత్తులను సేకరించి ఇళ్లకు తెచ్చుకుంటున్నారు. కొల్లూరు మండలంలోని పోతార్లంక చప్టా, భట్టిప్రోలు మండలం పెదపులివర్రు వద్ద చప్టాలపై వరద నీరు ఉధృతంగా ప్రవహిహిస్తోంది. దీంతో రెవెన్యూ, పోలీసు సిబ్బంది పహారా కాస్తున్నారు. చింతమోటు, పెసర్లంక, పెదలంక, గ్రామాల పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లోని వాణిజ్య పంటలను వరద నీరు ముంచెత్తింది. 6 లక్షల క్యూసెక్కులకుపైగా వరద నీరు వస్తేనే మెరక పొలాలు వరద ముంపునకు గురవుతాయి. అమావాస్య పోటుతో సముద్రంలోకి పూర్తి స్థాయిలో వరద నీరు వెళ్లడం లేదు. నదిలో నీట్టి మట్టం పెరగడంతో మెరక ప్రాంతంలోని పంటలను వరద నీరు ముంచెత్తుతోంది. ఎగువ నుంచి వరద నీరు కొంత మేరకు తగ్గడంతో రాత్రి 8 గంటలకు ప్రకాశం బ్యారేజీ నుంచి 4.87,508 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

మళ్లీ వరద వస్తే మా పరిస్థితి ఏంటి?

కొల్లూరు మండలం చింతల్లంక గ్రామానికి చెందిన మహిళా రైతు చావలి ఆదెమ్మ రెండున్నర ఎకరాల్లో పసుపు, కాకర, దొండ, దోస తదితర పంటలను సాగు చేస్తోంది. గతేడాది భారీ వరదకు వేసిన పంటలన్ని తుడిచి పెట్టుకుపోయాయని చెప్పింది. అప్పులపాలై ఇప్పుడిప్పుడే ఆ పరిస్థితుల నుంచి కోలుకుంటామనే తరుణంలో మళ్లీ కృష్ణానదికి వరద పోటెత్తడంపై ఆందోళన వ్యక్తం చేసింది. తమ పరిస్థితి ఏమిటంటూ కన్నీటి పర్యంతమైంది.



వేమూరులో పూర్తిగా దెబ్బతిన్న వెదనాట్లు

పల్లపు భూముల్లో దెబ్బతిన్న వెదనాట్లు

వేమూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 17 గ్రామాల పరిధిలో 80 శాతం రైతులు వెదనాట్లు వేశారు. ఈ పొలాలు పూర్తిగా నీట మునిగాయి. మురుగునీటి ప్రధాన కాల్వల మరమ్మతులు సక్రమంగా లేని కారణంగా.. నీరంతా పల్లపు భూముల్లో చేరింది. ఆ నీరు బయటకు పోక వేసిన నాట్లు పూర్తిగా కుళ్లిపోయాయి. మెరక భూముల్లో నిలిచిన నీటిని రైతులు బయటకు పంపి, నాటు మొక్కలను కొంత వరకు కాపాడుకోగలిగారు. కుళ్లిపోయిన మొక్కలను రోటోవేటర్ సాయంతో దమ్ము చేస్తున్నారు. మళ్లీ ఎకరాకు రూ.15 వేలకు పైగా ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు.



అరవింద వారధి వద్ద ఉధృతంగా వరద ప్రవాహం

నివాస గృహాలను ఖాళీ చేస్తున్న పల్లెకార్లు



ట్రాక్టర్‌లో సామగ్రి సర్దుకుంటూ..



గోతంలో సామాన్లు తరలిస్తున్న యవకుడు

దాచేపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : నాగార్జున సాగర్ డ్యాం నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో.. గురువారం మండలంలోని రామాపురం గ్రామంలో కృష్ణా నది ఒడ్డున నివాసం ఉంటున్న పల్లె కార్లను ముందస్తుగా అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, దాచేపల్లి తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్ సిబ్బందితో కలసి నది ప్రవాహాన్ని అంచనా వేశారు. నది ఒడ్డున 50కి పైగా పల్లె కార్లు నివాసం ఉంటున్నారు. రాత్రికి వరద నీరు మరింతగా పెరిగి నివాసం గృహాల్లోకి నీరు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. గ్రామంలోని ఉన్నత పాఠశాలలో వసతిని కల్పించారు. పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులు, హెల్త్ సిబ్బంది రామాపురం గ్రామంలో మకాం వేశారు. ఏ సమయంలోనైనా వరద నీరు ఒడ్డెక్కే ప్రమాదం ఉందని అధికారులు, పల్లెకార్లు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

వరద నీటిలో మునిగిన బెండ తోట



రైతుకు గుండెకోత..

రేపల్లె, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): భట్టిప్రోలు మండలం పెసర్లంక, ఓలేరు చప్టాలకు వరద నీరు పోటెత్తింది. లంక గ్రామాల్లోకి రాకపోకలు నిలిచిపోయాయి. పెసర్లంకకు వెళ్ళే లంక గ్రామాల రహదారులు, ఓలేరుడొంక రహదారిలో అనంతవరం సమీపంలో కృష్ణా వరద నీరు పోటెత్తటంతో కంద, పసుపు, అరటి, కూరగాయల పంటలు వందలాది ఎకరాలు జలమయమయ్యాయి. పెదపులివర్రు, ఓలేరు, పల్లెపాలెం, అనంతవరం, పెనుమూడి, ఘైనేని వారిపాలెం, చాట్రగడ్డ వద్ద భూములు భారీగా కోతకు గురయ్యాయి. వెయ్యి మీటర్లు ఒక్క చోటన్నా క్రాస్ బండ వేస్తే కోత నుంచి తప్పుకునే పరిస్థితి ఉంటుందని రైతులు చెబుతున్నారు.



పల్లెపాలెం సమీపంలో వరద పోటెత్తడంతో పసుపు పంట జలమయం



రావిఅనంతవరంలో భారీగా కోతకు గురైన పంట పొలాలు

దివ్యాంగ విద్యార్థులకు ఉపకార వేతనాలు

నరసరావుపేట కల్చరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక ఉపకార వేతనాలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రీ మెట్రిక్ (9వ తరగతి నుంచి 10 వ తరగతి చదువుతున్న) విద్యార్థులు ఈ ఉపకార వేతనాలు పొందడానికి అర్హులని తెలియజేశారు. వీరు ఆగస్టు 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. అలాగే ఇంటర్ ఆపై చదువుతున్న దివ్యాంగ విద్యా ర్థులు అక్టోబరు 31వ తేదీ లోగా కేంద్ర వెబ్‌సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలని చెప్పా రు. అర్హతలు ఉన్న విద్యార్థులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు ఉపకారవేతనాలు మం జూరు చేస్తారని, ఈ అవకాశాన్ని జిల్లాలోని దివ్యాంగ విద్యార్థులు సద్వినియోగించుకోవా లని తెలిపారు.

నీలంపాటి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

కనమర్లపూడి(శావల్యాపురం), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమర్లపూడి గ్రామంలోని నీలంపాటి అమ్మవారి ఆలయం వద్ద 5వ వార్షిక వేడుకలను గురువారం ఘ నంగా నిర్వహించారు. వేకువజామునే భక్తు లు నీలంపాటి అమ్మవారికి పాలాభిషేకాలు నిర్వహించి నూతనవస్త్రాలు, పూలమాలలతో అమ్మవారిని అలంకరించారు. అనంతరం అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చే శారు. ఆలయ ఆవరణలో పొంగళ్లు చేసి అమ్మవారికి నైవేద్యం, కానుకలు సమర్పించా రు. రాత్రికి విద్యుద్దీపాల వెలుతురులో నీలం పాటి అమ్మవారి జండాను మేళతాళాలతో గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తూ వైభవంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

తిరుపతమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

రొంపిచర్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల గ్రామంలో ఉన్న తిరుపతమ్మ ఆలయంలో మూడు రోజుల నుంచి ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. టీటీడీ, ధార్మిక పరిషత్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆలయం లో జరిగిన భజనా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు అందజేశారు.

హెచ్ఐవీపై అవగాహన సదస్సు

వినుకొండ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక గంగినేని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ, హాండ్స్ అఫ్ కంపాషన్ టార్గెటెడ్ ఇంటర్వెన్షన్ వారి ఆధ్వర్యంలో హెచ్ఐవీ, మ త్తు పదార్థాల వినియోగం విరమణపై అవ గాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కా ర్యక్రమానికి ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ కిషోర్, ఐసీటీసీ కౌన్సిలర్ సురేశ్ పాల్గొని మాట్లాడుతూ ప్రతి విద్యార్థి హెచ్ ఐవీ గురించి అవగాహన కలిగి ఉండాలని, ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని, డ్రగ్స్ వినియోగం చట్టరీత్యా నేరమని తెలియజేశారు. ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారు 2 నెలల ఐఈసీ ప్రోగ్రాం గురించి వివరించారు. కార్యక్రమం లో ఔట్‌రీచ్ వర్కర్స్ జయలక్ష్మి, ఆశా, రమేశ్, విజయ, రెహ్మత, అనూష పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

వినుకొండటౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి ఆత్మ హత్యకు పాల్పడిన సంఘటన పట్టణంలోని తిమ్మాయపాలెం రోడ్డులో బుధవారం జరిగిం ది. కుటుంబంలో ఆర్థిక సమస్యల నేపథ్యం లో భార్య ఇటీవల ఎలుకల మందులు తిని హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా కలత చెందిన భర్త ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న పోలీ సులు మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వాస్ప త్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యా ప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నగల చోరీపై కేసు

నాదెండ్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మం డలంలోని సాతులూరులో ఒక ఇంట్లో ఇటీ వల జరిగిన బంగారు నగల చోరీపై నాదెండ్ల పోలీ సులు కేసు నమోదు చేశారు. సాతు లూరుకు చెందిన ఈదర శ్రీనివాసరావు మూ డో తేదీన కుటుంబసభ్యులతో కలిసి శుభకా ర్యానికి మరో గ్రామానికి వెళ్లాడు. 4వ తేదీన హైదరాబాద్ వెళ్లి అక్కడి నుంచి చెన్నై వెళ్లా రు. తల్లి నాగేంద్రమ్మకు ఫోన్ చేయగా నీకు ఇచ్చిన నగు ఎక్కడ పెట్టావని? అడిగింది. ఆ టేబుల్‌పై పెట్టినట్టు తల్లికి వివరించాడు. ఇం ట్లో కన్పించలేదని తల్లి ఆయనకు తెలియ జేసింది. అనుమానం వచ్చి ఇంటి సమీపం లోని సీసీ కెమెరాలను పరిశీలించగా గుర్తు తెలియని ఇద్దరు టేబుల్‌పై ఉన్న బంగారు వస్తువులు చోరీ చేసినట్టు గుర్తించారు. శ్రీని వాసరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ పుల్లారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పల్నాడు జిల్లాకు 5 రిజర్వుడు బార్లు

నరసరావుపేట లీగల్, ఆగస్టు 21 (ఆంధ్ర జ్యోతి): ఇటీవల ప్రకటించిన నూతన ఎక్సైజ్ పాలసీలో పల్నాడు జిల్లాకు గీత ఉప కులా లకు 5 రిజర్వుడు బార్లు కేటాయించినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మణికంఠ గురువా రం తెలిపారు. నరసరావుపేట, సత్తెనపల్లి మున్సిపాలిటీలలో గౌడ్ కులానికి, చిలకలూరి పేట, మాచర్ల, దాచేపల్లి నగర పంచాయతీ లలో గౌడ కులానికి ఒక్కొక్కటి చొప్పున రిజ ర్వుడు బార్లు కేటాయించినట్లు ఆయన తెలి పారు. ఈనెల 29వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తు ఫారాలు స్వీకరిస్తా రన్నారు. ఈనెల 30వ తేదీ కలెక్టరేట్లో డ్రా తీస్తారని అన్నారు.

వినాయక చవితి ఏర్పాట్లపై సూచనలు

నరసరావుపేట లీగల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి), వినాయక చవితి సందర్భంగా మండపాల ఏర్పాట్లు, నిమజ్జనం సందర్భంగా నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గురువారం మొదటి పట్టణ పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన సమావేశంలో సిఐ చరణ్ పలు సూచనలు చేశారు.

మదమంచిపాడు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

● ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు
● దేవాలయ అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారం



నూతన కమిటీ సభ్యులను సత్కరిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మహిమా న్వితమైన మదమంచిపాడు శ్రీవీరాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి కమిటీ సభ్యులు కృషి చేయాలని ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనే యులు కోరారు. దేవాలయ అభివృద్ధి నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం గురువారం నిర్వహిం చారు. ముఖ్యఅతిథిగా ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు పాల్గొని కమిటీ చైర్మన్ సుబ్బారావు, పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివా రం, మంగళవారం దేవాలయం వద్దకు బస్సు సౌక ర్యం కల్పిస్తామని తెలిపారు. స్వామి వారి తిరుణాల మహోత్సవం వైభవంగా నిర్వహించడంతో పాటు కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిం చాలని కోరారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు, ఆలయ అధికారులు, జనసేన నాయకులు నాగశ్రీను, నాయకులు పాల్గొన్నారు.

రేపు ప్రజాదర్బార్

వినుకొండటౌన్, ఆగస్టు 21 (ఆంధ్ర జ్యోతి): నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి శుక్రవారం ప్రభుత్వ చీఫ్ విప్ కార్యాలయంలో 'ప్రజాదర్బార్' నిర్వ హిస్తున్నట్లు కార్యాలయవర్గాలు గురువా రం ఒక ప్రకటనలో తెలిపాయి. ప్రజా దర్బార్‌కు ప్రభుత్వ చీఫ్‌విప్, సీనియర్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి విన తులు స్వీకరిస్తారని వెల్లడించారు. నియోజకవర్గంలో ని ప్రజలు ప్రజాదర్బార్‌కు తరలి వచ్చి ఈ అవకాశం సద్వినియోగం చేసు కోవాలని కోరారు.

అందరికీ ఉచిత వైద్యం అందుబాటులోకి తేవాలి

● కేంద్ర ప్రభుత్వం ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
● ఆరోగ్య బీమాతో పేదలకు ఉన్నత స్థాయి వైద్యం అందించాలి
● క్యాన్సర్ నిర్ధారణ శిబిరం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, పాల్గొన్న భాష్యం రామకృష్ణ, సామినేని కోటేశ్వరరావు తదితరులు

యడ్లపాడు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : పేదల ఆరోగ్య రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆ దిశగా కేంద్రం ఆలో చన చేయాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లా రావు అన్నారు. గురువారం యడ్లపాడు మండలం బోయపాలెంలోని శ్రీఅనంతలక్ష్మి నూలు మిల్లులో సామినేని చారిటబుల్ ట్రస్టు, కాకతీయ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడు తూ ఎన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసినా ప్రజల ఆరోగ్యానికి సాటిరావన్నారు. రాష్ట్ర ప్ర భుత్వం ఎన్టీఆర్ వైద్య సేవ, సీఎంఆర్ఎఫ్‌ల ద్వారా పేదల వైద్యానికి అండగా నిలుస్తున్నప్పటికీ చాలా మంది పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు సరైన, నాణ్యమై న వైద్యసేవలు పొందలేక ఇబ్బందులు ప డుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక రా ష్ట్రాలు ఆర్థిక సమస్యలతో ప్రజారోగ్యంపై సరైన దృష్టి పెట్టలేకపోతున్నాయని, కేంద్ర ప్రభుత్వమే చొరవ తీ సుకుని నూతన విధానాలతో పేదవాడికి ఎంత ఖరీ దైన వైద్యమైనా ఉచితంగా అందించి వారి ఆరోగ్య ప రిరక్షణ ఆలోచన చేయాలన్నారు. సామినేని చారిట బుల్ ట్రస్టు, కాకతీయ ఫౌండేషన్‌లు విద్య, వైద్యంలో అందిస్తున్న సేవలు అభినందనీయమని ప్రశంసిం చారు. భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామ కృష్ణ మాట్లాడుతూ క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవా లంటే చాలామంది భయపడతారన్నారు. వారిలో అవగాహన పెంచేందుకు ఇలాంటి వ్యాధి నిర్ధారణ శిబిరాలు దోహదపడతాయనడంలో సందేహం లేద ని, అయితే అన్ని రకాల వైద్యసేవలతో కలిపి శిబి రాలు నిర్వహిస్తే ఈ సమ స్యను అధిగమించవచ్చని అభిప్రాయపడ్డారు. కాకతీయ ఫౌండేషన్ చైర్మన్ గూడూరు సత్యనారాయణ మాట్లాడుతూ తమ ఫౌం డేషన్ ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రధానంగా విద్య, వైద్యం అందించడంలో విశేష సేవలు అందిస్తున్నా మన్నారు. బసవతారకం ఆస్పత్రి వైద్యురాలు డాక్ట ర్ రేణుక మాట్లాడుతూ ప్రాథమిక దశలో క్యాన్స ర్‌ను గుర్తించగలిగితే పూర్తిగా నయం చేయడం సాధ్యమేన్నారు. క్యాన్సర్ గుర్తించేందుకు ముంద స్తు స్ర్కీనింగ్ పరీక్షలు దోహదపడతాయన్నారు. అలాగే క్యాన్సర్‌కు సంబంధించి హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చిందని, దీనిని 9 నుంచి 14 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన పిల్లలకు రెం డు డోసులు చొప్పున వేయించాలన్నారు. అలాగే 15-21 సంవత్సరాల మధ్యగల మహిళలకు మూడు డోసులు వేయించుకోవాలన్నారు. ట్రస్టు చైర్మన్ సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్క రూ సేవా దృక్పథంతో ముందుకు రావాలని కోరారు. తన తండ్రి స్ఫూర్తితో ట్రస్టు ఏర్పాటుచేసి విద్య, వైద్య సేవలతోపాటు ఆపన్నులకు చేయూత ఇస్తున్నామన్నారు. అనంతరం సామినేని చారిటబు ల్ ట్రస్టు ఆధ్వర్యంలో క్యాన్సర్ నివారించడంలో దోహదపడే 250 లక్ష్మణఫలం మొక్కలను అతిథుల చేతుల మీదుగా ప్రజలకు పంపిణీ చేశా రు. రెండు రోజులపాటు నిర్వహించనున్న ఈ శిబిరంలో తొలి జైన గురువారం 150మందికి క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీ క్షలు నిర్వహించారు.

● నూలుమిల్లులో గురువారం జరిగిన క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సందర్శించారు. మిల్లు ఆవరణలో లక్ష్మ ణఫలం మొక్కను నాటారు. కార్యక్రమంలో మిల్లు ఈడీ సామినేని ఫణికుమార్, వసంత ఇండస్ట్రీస్ డైరె క్టర్ పారుపల్లి నాగేశ్వరరావు, టీడీపీ నేతలు సాయి బాబు, కుర్రా రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహిళల బాల్ బ్యాడ్మింటన్ శిక్షణ ఏర్పాట్ల పరిశీలన



శిక్షణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న పాఠశాల యాజమాన్యం

వినుకొండ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : నిర్మలా ఐసీఎస్ఈ స్కూల్ క్యాంపస్ నందు ఉమ్మడి గుంటూరు జిల్లా మహిళల బాల్ బ్యాడ్మింటన్ శిక్షణ ఏర్పాట్లను పాఠశాల సుపీ రియర్ సిస్టర్ సిసిలీ, హెడ్మిస్ట్రెస్ సిస్టర్ రాణి, పాఠశాల పీఈటీ శ్రీనివాసరావు, బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జాయింట్ సెక్రెటరీ జోనా నాయక్, ఎస్ఎస్‌పీ హైస్కూల్ పీడీ ఆర్ రాధాకృష్ణమూర్తిలు ఏర్పాట్లను పరిశీలించారు. శుక్రవారం నుంచి ఈ నెల 28 వరకు ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ వై.శ్రీనివాసరావు, ప్రెసిడెంట్ ఈ.శివశంకర్ ఆధ్వర్యంలో ఉమ్మ డి గుంటూరు మహిళల జట్టు, సబ్ జూని యర్ బాలికల జట్లకు శిక్షణ శిబిరాలను నిర్వ హిస్తున్నట్లు తెలియజేశారు. ఇక్కడ శిక్షణ పొందిన జిల్లా జట్లు ఈ నెల 29 నుంచి 31 వరకు ప్రకాశం జిల్లా చేవూరులో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొననున్నారు. క్రీడాకారులకు ఉచి త వసతి, భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏడీ పి.ఆంజనేయు లు, పీఈటీ సంధ్య, పాఠశాల సిస్టర్స్ ఉపా ధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తయాప్‌తో డ్వాక్రా లావాదేవీల అక్రమాలకు అడ్డుకట్ట

● డీపీఎం శ్రీనివాసరావు

శావల్యాపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా లావాదే వీల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన యాప్ లను రూపొందించిందని, గ్రామాల్లో వీవోఏలు అన్ని డ్వాక్రా సంఘాల లావాదేవీ లను యాప్‌ల్లో నమోదు చేయాలని పల్నాడు జిల్లా డీపీఎం శ్రీనివాసరావు తెలి పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్తగా రూపొందించి న ఎంబుక్ కీపింగ్, లోగోస్ యాప్‌లపై స్థానిక మండలసమాఖ్య కార్యాల యంలో గురువారం సీసీలు, వీవోఏలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీపీఎం శ్రీని వాసరావు మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు తీసుకొనే బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి రుణాలు, వారు చెల్లించిన కిస్తీలు వంటి అన్ని అంశాలు యాప్‌లో నమోదు చేస్తారన్నారు. డ్వాక్రా లావాదేవీల న్నింటినీ ప్రభుత్వం త్వరలో మన డబ్బులు-మన లెక్కలు అనే పబ్లిక్ పోర్టల్‌లో పెట్టనుం దని, తద్వారా ప్రతి ఒక్కరూ తీసుకొన్న రుణాలు, చెల్లింపుల ను సులువుగా చూసుకొ నేందుకు అవకాశముంటుందన్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు గోనుగుంట్ల భారతి, కార్యదర్శి వేగుల కుమారి, కోశాధికారి వర లక్ష్మి, జీవనోపాధుల ఏపీఎం గుమ్మడిల్లి వాసుబాబు, ఇన్ చార్జి ఏపీఎం అబ్బూరి రామారావు, ఎల్‌సీ బ్రహ్మయ్య పాల్గొన్నారు.

పనిచేయని ఫోన్లతో ఎలా విధులు నిర్వహించాలి

● అంగన్వాడీ యూనియన్ నాయకుల ఆగ్రహం

నరసరావుపేట టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పనిచేయని ఫోన్‌లు అధి కారులకు అప్పగిస్తే తిరిగి అదే ఫోన్లు వెన క్కు తీసుకొని పనిచేయాలని సూపర్‌వైజర్లు అంగన్వాడీలను వేదింపులకు గురి చేయడం పై సీఐటీయు పల్నాడు జిల్లా ప్రధాన కార్య దర్శి ఎస్ ఆంజనేయులునాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఏపీ అంగ న్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీ యూ) ఆధ్వర్యంలో పీడీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ ఫోన్ల లో లబ్ధిదారుల నమోదుకు తిప్పలు, బాలింత లు, గర్భిణుల గుర్తింపునకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. అంగన్‌వాడీలకు 2014 నుంచి ఇప్పటి వరకు వేతనాలు పెంచలేదని, 42 రోజుల చారిత్రాత్మక సమ్మె సందర్భంగా వేతనాలు పెంచుతామని ఇచ్చిన మినిట్స్ ఆధారంగా తక్షణమే వేతనాలు పెంచాల న్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కేపీ మెటిల్డాదేవి మాట్లాడుతూ మినీసెంటర్‌లను మెయిన్ సెంటర్లుగా మార్చాలన్నారు. యాప్ లు సరిగ్గా పనిచేయకపోవడం, 2జీ ఫోన్లతో సకాలంలో ముఖచిత్ర గుర్తింపు ప్రక్రియ జరగక ఇటు లబ్ధిదారులు, అటు అంగన్వాడీ లు అవస్థలు పడుతున్నారని అన్నారు. 5జీ కొత్త ఫోన్లు మంజూరు చేసి అన్ని యాప్‌లు కలిపి ఒక యాప్‌గా మార్పుచేయాలన్నారు. అంగన్వాడీ యూనియన్ నాయకులను చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డీ శివకుమారి, యూనియన్ నాయకులు, అధికసంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

దివ్యాంగ పింఛన్‌లకు దరఖాస్తులు

బొల్లాపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రభుత్వం ఇటీవల 153 పిం ఛన్‌దారులను అనర్హులుగా తొలగించటంతో మరలా అప్పీలు చేసుకొనేందుకు అవకాశం ఇవ్వటంతో గురువారం పింఛన్‌పోయిన దివ్యాంగులు ఎంపీడీవో కార్యాలయానికి 33 పంచాయతీల్లోని భారీగా తరలి వచ్చి మర లా ఎంపీడీవోకు అర్జీలు ఇచ్చారు. మూగచిం తలపాలెం గ్రామానికి చెందిన తొమ్మిది కుటుంబాలు ఎంపీడీవోకు పింఛన్‌లను మర లా పునరుద్ధరించాలని, దరఖాస్తులను ఎంపీ డీవోకు అందజేశారు. బుధ, గురువారాల్లో 83 దరఖాస్తులు వచ్చినట్టు ఆయన తెలిపారు. జనసేన పార్టీ బొల్లాపల్లి మండల సెక్రటరీ కొల్లి నాసరబాబు, కొల్లి నాసరబాబు మూగ చింతలపాలెంలో తొలగించిన పింఛన్‌లను తిరిగి పునరుద్ధరించాలని ఎంపీడీవోకు వినతి పత్రాలు అందించారు.

అన్నదాత సుఖీభవ సమస్యలు పరిష్కరించాలి

● ఆర్డీవో మధులత

రొంపిచర్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో అన్నదాత సుఖీభవకు సం బంధించి నగదు జమ కాని రైతుల సమస్యలను పరిష్కరించాలని ఆర్డీవో మధులత గురువారం వీఆర్‌వోలను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌వోలు, కార్యాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 803 మంది రైతులకు సంబంధించిన ఆధార్, ఫొటో, పాసు పుస్తకంలో వివరాలు సక్రమంగా లేకపోవటం వల్ల నగదు జమకాదని తెలిపా రు. వీఆర్‌వోలు వారికి సంబంధించిన గ్రామాల్లో నగదు జమకాని వారి వివరాలు సేకరించి సమస్యలను పరిష్కరించాలన్నారు. అదే విధంగా పీజీఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వారితో మాట్లాడి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బండి నిర్మల, ఆర్ఐ కోటేశ్వరరావు, డీటీ వెంకటరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ జనార్దన్‌రావు పాల్గొన్నారు.

రైతులు దశలవారీగా ఎరువులు తీసుకోవాలి


● శావల్యాపురం సొసైటీ చైర్మన్ విశ్వనాథం



రైతులకు ఎరువుల బిల్లులు అందజేస్తున్న చైర్మన్ విశ్వనాథం

శావల్యాపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ప్రారం భమైనందున శావల్యాపురం సొసైటీ పరిధిలో రైతులందరికీ సమృద్ధిగా ఎరువులను అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామని, రైతులు ఒకేసారి కాకుండా దశలవారీగా ఎరువులు తీసుకొని సహ కరించాలని సొసైటీ చైర్మన్ గడిపూడి విశ్వనాథం తెలిపారు. స్థాని క సొసైటీ కార్యాలయంలో గురువారం రైతులకు ఎరువులు పంపి ణీ చేశారు. చైర్మన్ విశ్వనాథం మాట్లాడుతూ రైతులు అన్ని దశ లకు ఒకేసారి ఎరువులు తీసుకొని నిల్వ పెట్టుకోవడం వల్ల మిగిలి న రైతులకు ఇవ్వడం కష్టతరంగా మారుతుందని, కాబట్టి మొదటి దశకు అవసరమైన ఎరువుల వరకే తీసుకొని రెండోదశకు తర్వాత తీసుకోవాలన్నారు. ప్రభుత్వం వద్ద ఎరువుల నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవస రం లేదన్నారు. సొసైటీ సీఈవో జాలాది నాగప్రసాద్ పాల్గొన్నారు.

చిన్నారి శ్రీలక్ష్మి అమ్మవారి వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో చిన్నారి శ్రీలక్ష్మి అమ్మవారు

బొల్లాపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగినీడు పాలెంలో చిన్నారి శ్రీలక్ష్మి అమ్మవారు 5వ వార్షిక వేడుకలు గురు వారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి వార్షికోత్సవం సంద ర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భారీ అన్నదాన కార్యక్ర మాలు 101 బిందె కలశాలతో ఊరేగింపు, సాయంత్రం వేళ మహిళలతో కోలాట ప్రదర్శన ప్రజలను ఎంతగానో అలరించాయి.

పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యం : ఏపీవో

నూజెండ్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎన్ఆర్ ఈజీఎస్ ఏపీవో ఆంజనేయరాజు గురువారం తెలిపారు. మండ లంలో 13,897 జాబ్ కార్డులు ఉండగా ఈ ఏడాది 4,40,941 పని దినాలు కల్పించామన్నారు. మండలంలో సన్న, చిన్న కారు రైతులు తమ పొలాల్లో పండ్ల, పూల తోటల పెంపకానికి రాయితీలు కల్పిస్తున్నామన్నారు.

పిల్లలు బాగా చదువుకోవడానికి పుస్తకాల పంపిణీ

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పిల్లలు బాగా చదువుకోవ డానికి, ఆర్థికంగా వెసులుబాటుకు పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. గురువారం నరసరావుపేట పట్ట ణంలోని బ్రహ్మానందరెడ్డి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో కత్తుల రాజనరసిం హులు, పూర్వ విద్యార్థుల సహకారంతో విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా 500 మంది విద్యార్థులకు తలా ఐదు పుస్తకాలు అందజేశారు. ఇప్ప టికే విద్యార్థులకు బ్యాగులు, బూట్లు, బెల్టులు, పుస్తకాలు ఇచ్చారని అన్నారు. వాలీబాల్‌లో ఐదుగురు పిల్లలు జాతీయ క్రీడోత్సవానికి ఎంపికయ్యారన్నారు. ఇటీవల పట్టణంలోని ఓరియంటల్ స్కూల్‌కు పూర్వవిద్యార్థులు ప్రహరీ, క్రీడా వస్తువుల కోసం రూ.12 లక్షలు పోగుచేశారన్నారు. క్రిస్టియన్‌పాలెం స్కూల్ క్రీడాప్రాంగణం అభివృద్ధికి పీ-4 కార్యక్రమంలో భాగంగా పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చారన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గట్టుపల్లి సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొగాకు కొనుగోళ్లు వేగవంతం చేయాలి

● నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ నాయకులు

యడ్లపాడు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : పొగాకు కొనుగోళ్లు వేగవంతం చేసి రైతులకు న్యాయం చేయాలని నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు యడ్లపాడు మండలంలోని స్పైసెస్ పార్కులో మార్క్‌ఫెడ్ ఏర్పాటుచేసిన పొగాకు కొను గోలు కేంద్రాన్ని టీడీపీ నాయకులు గురువారం సందర్శించారు. రైతుల సమస్య లను అడిగి తెలుసుకున్న నాయకులు కొనుగోళ్ళలో జాప్యం వల్ల రైతులు ఆర్థి కంగా ఎంత నష్టపోతున్నదీ, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అక్కడ ఉన్న మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు, ఇతర అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో పెట్టుబడులకు అవసరమైన డబ్బులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, పొగాకు కొనుగోళ్లలో జాప్యం లేకుండా చూడడంతోపాటు 20 క్వింటాళ్ళలోపు నిల్వలను వెంటనే కొనుగోలు చేయాల న్నారు. అలాగే కొనుగోలు చేసిన పొగాకు తాలూకు రైతులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని, తేమ శాతం, నాణ్యతలో మినహాయింపులు ఇచ్చి రైతులను ఆదుకోవాలన్నారు. రోజువారీ కొనుగోళ్ళ వివరాలను ఒక రోజు ముందుగానే రైతులకు తెలియచేయాలని కోరారు. టీడీపీ నాయకుల విజ్ఞప్తిని విన్న మార్క్‌ఫెడ్ చైర్మన్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సాయిబాబు, ఏఎంసీ చైర్మన్ షేక్ కరీముల్లా, మాజీ చైర్మన్ నెల్లూరి సదాశివరావు, చిలకలూరిపేట మండల అధ్యక్షుడు జవ్వాజి మదన్‌మో హన్, ఏఎంసీ వైస్ చైర్మన్ పిల్లి కోటి, రైతు నాయకులు గుర్రం నాగపూర్ణచంద్ర రావు, మురకొండ మల్లిబాబు, మార్కెట్ యార్డు డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఎరువుల గోదాములో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తనిఖీ



జీడీసీఎంఎస్ గోదాములో ఎరువులను పరిశీలించి, రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు

రొంపిచర్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రొంపిచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డులో గల జీడీసీఎంఎస్ గోదామును జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జగ్గా రావు గురువారం తనిఖీ చేశారు. ఎరువుల పంపిణీ నేపథ్యంలో రైతులతో మాట్లాడారు. స్టాక్, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ జిల్లాలో ఎరువులు సాగుకు అనుకూలంగా ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంటాయని, అక్కడ ఉన్న అధికారులను సంప్రదించాలన్నారు. ఎరువులు కావాలంటే రొంపిచర్ల వరకు రావాల్సిన పని లేదన్నారు. రైతులకు ఎరువులను సక్రమంగా పంపిణీ చేయాలని జీడీసీఎంఎస్ సిబ్బందిని ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో ఏవో శివ లలిత, ఏఈవో ముప్పూరి వెంకటరావు, జీడీసీఎంఎస్ సిబ్బంది పల్లెల కోటిరెడ్డి పాల్గొన్నారు.

ప్రపంచ పారిశ్రామిక వేత్తల దినోత్సవం



విజేతలతో ప్రిన్సిపాల్ జీ నాగమల్లేశ్వరరావు తదితరులు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కేసానుపల్లిలోని ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఓ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్, ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ప్రపంచ పారిశ్రామిక వేత్తల దినోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు గ్రూప్ చర్చలు, క్విజ్, వ్యాస రచన కాంపిటీషన్ నిర్వహించారు. విజేతలకు జ్ఞాపికలు అందజే శారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీ నాగమల్లేశ్వరరావు, సెక్ర టరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహిద్దీన్, ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమా, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనధికార తాగునీటి కుళాయిలను క్రమబద్ధీకరించాలి

● గ్రామ సభలో తీర్మానం

నాదెండ్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : గణపవరం రక్షిత నీటి పథకం అనధికారి కంగా ఉన్న సుమారు ఎనిమిది వందల మంచి నీటి కుళాయిలను పునరుద్ధరిం చాలని గురువారం జరిగిన గ్రామ సభలో తీర్మానించారు. ఎంపీడీవో, ప్రత్యేక అధికారి ఎస్ స్వరూపరాణి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావులు ముఖ్యఅతిథిగా సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనధికార కుళాయి లబ్ధి దారులకు నోటీసులు ఇవ్వాలని నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.5వేలు, బీసీ, ఓసీలకు రూ.6వేలు, చిన్న వ్యాపారులకు రూ.7వేలు, పరిశ్రమలకు రూ.10వేలు చొప్పున డిపాజిట్‌గా వసూలు చేయాలని ప్రత్యేక అధికారి ఎస్ స్వరూపరాణి సూచించారు. త్వరలోనే పైపులైన్‌లకు మరమ్మతులు చేసి స్వచ్ఛమైన తాగు నీటిని అందిస్తామని మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు వివరించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి మారుతీబాబు, సొసైటీ అధ్యక్షుడు పెంటా ల శేషగిరిరావు, మాజీ అధ్యక్షుడు ఎం లక్ష్మీనారాయణ, నాయకులు కెల్లంపల్లి అచ్చయ్య, గాలి బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



గణపవరం గ్రామసభలో పాల్గొన్న అధికారులు, ప్రజా ప్రతినిధులు